www.janashaktionline.com

# జనశక్తి

విప్లవ కమ్యూనిస్టుల పక్ష పత్రిక

సంపుటి : 44 సంచిక : 1 విజయవాడ 5-5-2011 పేజీలు : 8 వెల: రు 5.00



లోపలి పేజీల్లో...

- ఆధిపత్యం కోసం ఐవరీ కోస్టులో ఫ్రాన్స్ సైనిక దురాక్రమణ
- దేశ భద్రతకు ముప్పుగా మారనున్న సామ్రాజ్యవాద కంపెనీల అణువిద్యుత్ కేంద్రాలు
- కాలుష్యపూరితం కానున్న కొంకణతీరం
- రైతుకూలీసంఘం (ఆం.ప్ర.) రాష్ట్ర కార్యవర్గ తీర్మానాలు
- ప్రపంచ బ్యాంకు షరతులకు లోబడి నాగార్జునసాగర్–కృష్ణా డెల్టాల ఆధునీకరణ పనులు


## బానిస సంకెళ్ళను త్రెంచివేసే పోరాట దినం 'మేడే'

**8** గంటల పనిదినాన్నీ, కార్మికుల పని పరిస్థితుల మెరుగుదలనూ కోరుతూ 1886లో చికాగో నగర వీధులలో అమెరికా కార్మికవర్గం తన రక్తాన్ని చిందించింది. ఆ పోరాట ఉత్తేజం ప్రపంచమంతటికీ వ్యాపించిన ఫలితంగా ఆ రక్త తర్పణను స్మరిస్తూ ప్రతి యేడూ మే నెల మొదటి తేదీన కార్మికవర్గ దీక్షాధారణ దినంగా ప్రపంచ కార్మికవర్గం పరిగణిస్తున్నది. మేడేన ప్రపంచ నలుమూలలా దోపిడీ పీడనలను అంతంచేయటానికి వెల్లివిరిసే పోరాట చైతన్యం కార్మికవర్గ అంతర్జాతీయ కర్తవ్యాలకు దర్పణం.

గత 125 సంవత్సరాలలో ప్రపంచ కార్మికోద్యమం విజయాలనూ సాధించింది, ఓటములకూ గురైంది. మహత్తర అక్టోబరు విప్లవం రష్యాలో కార్మికవర్గ విప్లవాన్ని తెచ్చింది. వెనుకబడిన సామ్రాజ్యవాద దేశమైన రష్యాను పాతికేళ్ళలో ఆకలి, దారిద్ర్యంలేని దేశంగా మార్చింది. దోపిడీ పీడనలులేని సోషలిస్టు సమాజం దిశగా పయనింపచేసింది. వలస, అర్థభూస్వామ్య దేశంగావున్న చైనాలో కార్మిక–కర్షకమైత్రి పునాదిగా కార్మికవర్గ నాయకత్వాన సాగిన నూతన ప్రజాస్వామిక విప్లవం విజయవంతమై వలసపాలనలో మ్రగ్గిపోతున్న ఆసియా, ఆఫ్రికా లాటిన్ అమెరికా దేశాలకు విముక్తి మార్గాన్ని చూపింది. ఫ్యూడలు వ్యవస్థను ధ్వంసంచేసి సహకార వ్యవసాయక్షేత్రాల నిర్మాణంతో సోషలిస్టు సమాజ నిర్మాణానికి పూనుకుంది. తూర్పు యూరపు దేశాలలో ప్రజాతంత్ర వ్యవస్థలు నెలకొని సోషలిజం వైపుగా అడుగులు వేశాయి. ప్రపంచ మానవాళిలో మూడవ వంతు సామ్రాజ్యవాద సంకెళ్లను త్రెంచుకుని విముక్తిని పొందింది.



తర్వాతి కాలంలో అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమంలో తలయెత్తిన రివిజనిజం, సోషలిజం నిర్మాణాన్ని తిరోగమనానికి గురిచేసింది. రష్యాలో కృశ్చేవ్ ఆధునిక రివిజనిజం పెట్టుబడిదారీ పంథాను చేపట్టింది. సోవియటు యూనియనును సోషల్ సామ్రాజ్య వాదంగా దిగజార్చింది. చైనాలో డెంగ్ ముఠా పెట్టుబడిదారీ పునరుద్ధరణను చేపట్టింది. అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమానికి తగిలిన ఈ ఎదురు దెబ్బకు సామ్రాజ్యవాదం చంకలు గుద్దుకుంది. చరిత్రకు అంతమనీ, పెట్టుబడిదారీ విధానమే మానవాళికి శరణ్యమనీ ప్రచారం సాగించింది. కమ్యూనిస్టు సిద్ధాంతం పైనా రాజకీయాలపైనా విషం కక్కింది. తన దోపిడీ పీడనలకు తిరుగులేదని విర్రవీగింది.

అయితే సామ్రాజ్యవాద ఆర్థిక వ్యవస్థ అనివార్యంగా సంక్షోభంలో పడింది. సంక్షోభ భారాన్ని ప్రపంచ ప్రజలపై మోపేందుకూ, ప్రపంచ వనరులను తన కైవశం చేసుకునేందుకూ ఆధిపత్య స్థాపనకు పూనుకుంది. సామ్రాజ్య వాదం ఉనికిలో వున్నంతకాలమూ యుద్ధం తప్పదన్న లెనినిస్టు సూక్తిని మరోసారి నిరూపించింది. ఆఫ్ఘనిస్తాన్, ఇరాక్‌లను దురాక్రమించింది. పశ్చిమాసియాను అగ్నిగుండంగా మార్చింది. లక్షలాది ప్రజలను హతమార్చింది. యుగోస్లావియాలో జాతుల నిర్మూలన సాగించి ముక్కలు చేసింది. అయినా ఆర్థిక సంక్షోభం తగ్గలేదు. మరోసారి ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయింది. రాత్రికి రాత్రే లక్షల కోట్ల డాలర్ల ద్రవ్య ఆస్తులు మాయమయ్యాయి. వేలకోట్ల డాలర్ల ప్రజాధనాన్ని గుత్తపెట్టుబడిదారుల ఒడిలో కుమ్మరించినా కోలుకోలేదు. నిరుద్యోగం తారాస్థాయికి చేరింది. అమెరికా జనాభాలో 17శాతం మంది రెండు పూటలా పస్తులుండే స్థితి ఏర్పడింది. 43శాతం మంది ఇళ్లు కోల్పోయారు. 40శాతం మంది వైద్యం చేయించుకునేందుకు ఆస్పత్రులకు వెళ్లలేని దుస్థితిలో వున్నారు. మార్పు తెస్తానంటూ అధికారంలోకి వచ్చిన ఒబామా పాత విధానాలనే కొనసాగించాడు. పశ్చిమాసియాలో యుద్ధాన్ని విస్తరించాడు. ఉద్దీపనా పథకాలతో గుత్తపెట్టుబడిదారులను ఆదుకొన్నాడు. అయినా వారానికి 40 వేలమంది చొప్పున అమెరికన్‌లు నిరుద్యోగులయ్యారు. తీవ్ర అసంతృప్తి నెలకొన్న అమెరికా కార్మిక వర్గాన్ని అణచివేసేందుకు ప్రజాస్వామిక హక్కులను కాలరాచే నిరంకుశ చట్టాలను తెచ్చాడు.

సామ్రాజ్యవాద దోపిడీ అణచివేతలతో జీవనాధారాలు చిన్నాభిన్నమైన ప్రపంచ ప్రజలు ఆందోళనలు చేస్తున్నారు. ట్యునీషియా నుండి బెహరీన్ వరకూ ఆరబ్ ప్రజలు నిరసనలూ, ఆగ్రహమూ ప్రదర్శించారు. దోపిడీ పాలకులు వైదొలగాలని ఉద్యమించారు. భ్రష్టుపట్టిపోయిన, తన తైనాతీలైన పాలకులను తొలగించి, సామ్రాజ్యవాదులుమరో దళారీ ముఠాను అధికారంలోకి తెచ్చారు. దీనినే విప్లవంగా చిత్రించి ప్రజాఉద్యమాలను

(తరువాయి 2వ పేజీలో)

సంపాదకీయం

## పేదరిక "నిర్మూలన"

**"భారతదేశం** పేదదేశంకాదు, భారత ప్రజలు పేదరికంలో వున్నారు" అన్న రజనీ పామీదత్తు మాటలు ఇటీవలి కాలంలో పదేపదే గుర్తుకు వస్తున్నాయి. భారత దేశ సంపదలను బ్రిటీషు వలస పాలకులు దారిదోపిడీ రీతిలో బ్రిటన్‌కు తరలించుకు పోయినందున భారత ప్రజలు పేదరికంలో మగ్గుతున్నారని ఆయన తన గ్రంథం "నేటి భారత దేశం"లో వివరించారు.

అధికార మార్పిడి తర్వాత భారత సంపదల తరలింపు ఎన్నోరెట్లు పెరిగి కొనసాగటమే నేటి భారత ప్రజల పేదరికానికి మూలంగావుంది. లాభాలూ, రాయల్టీలు, సాంకేతిక ఫీజులూ, ఇతర రూపాలలో విదేశాలకు తరలిపోతున్న ధనమూ, విదేశీరుణాలకు తిరిగి చెల్లింపులూ కలిసి స్థూల జాతీయ ఉత్పత్తిలో నాల్గవవంతు వరకూ వుంది. ఇదంతా "చట్టబద్ధ" తరలింపు.

ఇది కాక చట్టవిరుద్ధంగా దేశం నుండి తరలిపోయిన నల్లధనం గత రెండు దశాబ్దాలలోనూ 60 లక్షల కోట్ల రూపాయలు ఉందని అంచనా. ఇదంతా స్వాధీనం చేసుకుంటే, దీనిపై వచ్చే బ్యాంకు వడ్డీతోనే ప్రజలు పైసా పన్నుకట్టకుండా ప్రభుత్వం నడిచి పోతుంది. ఇదికాక భారత బూర్జువాలకూ పన్నులు, తదితర రాయితీలతో యుపిఏ పాలనలో 20 లక్షల కోట్ల రూ॥ అందించారు. భారత ప్రజల శ్రమశక్తి ఫలమైన సంపదను ఇన్ని రూపాలలో దేశీయ, విదేశీ గుత్తపెట్టుబడిదారులు కొల్లగొట్టడంతో వారు నానాటికీ సంపన్నులవుతున్నారు. భారత శ్రమజీవులు పేదరికంలో మ్రగ్గిపోతున్నారు.

భారత పాలకులు దారిద్ర్య నిర్మూలనకు కట్టుకున్న కంకణం లెక్కల్లో దారిద్ర్య నిర్మూలనగా తయారైంది. "భారత్ ప్రకాశిస్తోంద"ంటూ బిజెపి పాలకులు ప్రచారం చేసిన కాలంలో ప్రణాళికా సంఘం భారత దేశంలో దరిద్రుల సంఖ్య తగ్గిందని, దారిద్ర్య రేఖకు దిగువనున్న కుటుంబాలు 28 శాతమేననీ చెప్పింది. ఇటీవల ప్రణాళికా సంఘం అధ్యక్షుడు మాంటేక్‌సింగ్ ఆహ్లువాలియా గత ఐదేళ్ళలో పేదరికం 37.2 శాతం నుండి 32 శాతానికి తగ్గినట్లు (2005–10 మధ్యన) ప్రకటించాడు. అంటే యుపిఏ పాలనా కాలంలో అప్పటి 28 శాతం 37.5 శాతమెలా అయ్యిందో ఆయన చెప్పలేదు.

గోదాములలో ఆహార ధాన్యాలు ముక్కి పోతుండగా, ఆకలి బాధకు ప్రజలు గురికావటం సహించరానిదనీ, ఈ విధంగా రెండు భారత్‌లను అనుమతించరాదంటూ సుప్రీం కోర్టు ప్రజలను ఆహారాన్నందించమని కోరింది. దీనితో ఆహార హక్కు చట్టాన్ని చేస్తానంటూ యుపిఏ ప్రభుత్వం ప్రచారం మొదలు పెట్టింది. రెండవ వైపున దేశంలో పేదరికం తగ్గిందనీ, ప్రస్తుత ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా ప్రజలకు ఆహారధాన్యాలు అందిచగల నిల్వలున్నాయనీ, అవసరమైతే ప్రజా పంపిణీ వ్యవస్థను పటిష్ఠం చేస్తాననీ సుప్రీంకోర్టు దీనిని అంగీకరించలేదు. మరో ప్రక్క ఆహార హక్కు చట్టం ముసాయిదాను అమలు చేయటం సాధ్యం కాదని రంగరాజన్ కమిటి తిరస్కరించింది. దీనితో ప్రణాళికా సంఘం కొత్త గణాంకాలను వండి వార్చింది.

దారిద్ర్యరేఖకు దిగువనున్న వారిని లెక్కించటానికి రోజుకు ఒక డాలరు (సుమారు 44రూ॥) కంటే తక్కువ ఆదాయముండటాన్ని అంతర్జాతీయంగా ప్రమాణంగా పరిగణిస్తున్నారు. కాగా ప్రణాళికా సంఘం పట్టణ ప్రాంతాల్లో రోజుకు 12 రూ॥, గ్రామాలలో 11 రూ॥లు ప్రమాణాలుగా లెక్కవేస్తుంది. అంటే అంతర్జాతీయ ప్రమాణంలో నాల్గవ వంతు. ప్రణాళికా సంఘమే నియమించిన అభిజిత్ సేన్ కమిటి రోజుకు 20 రూ॥ ఆదాయాన్ని ప్రమాణంగా తీసుకుని లేక్కవేసే దేశ జనాభాలో 80 శాతం మంది దారిద్ర్యంలో వున్నట్లు తేల్చింది. ఇదికాక ప్రమాణంగా తీసుకున్న రూపాయలతో ఎన్ని ఆహార ధాన్యాలు కొనుగోలు చేయగలరన్న లెక్కకోసం టోకు ధరల సూచికను తీసుకుంటారు. టివిలను, కూలర్లను నిత్యావసర సరుకులలో కలిపి టోకు ధరల సూచికను తక్కువ చేస్తున్నారు. ఆ విధంగా ఎక్కువ ఆహారం కొనగలరని నిర్ధారించి పేదల సంఖ్య తగ్గిస్తున్నారు. దారిద్ర్య గణాంకాలు ఇంత దరిద్రంగా తయారవుతున్నాయి. వారి దారిద్ర్యాన్ని సంఖ్యల్లో తగ్గిస్తున్న ప్రభుత్వం దారిద్ర్య నిర్మూలనా పథకాలను ఏకరువు పెడుతున్నది. వీటి అమలూ అంత దరిద్రంగానే వుంది. అమలేకాదు వాటి రూపకల్పన వెనుకనున్న అవగాహనకూడా దరిద్రంగానే వుంది. ఆంధ్రప్రదేశ్‌లో జలయజ్ఞం కార్యక్రమం పూర్తయితే 32 లక్షల ఎకరాలకు సాగునీరందేది. దీనికయ్యే వ్యయం ఆనాటి అంచనా రూ॥ 48 వేల కోట్లుకాగా గ్రామీణ ఉపాధి హామీపథకానికి ఏడాదికి చేస్తున్న వ్యయం రూ॥ 40 వేలకోట్లు. దీనికి బదులుగా ఆ నిధులను జలయజ్ఞానికి వెచ్చించి వుంటే సాగునీటివల్ల వ్యవసాయం పెరిగి, గ్రామీణ జనాభాకు శాశ్వతమైన ఉపాధి పెరిగేది. కానీ జరిగిందేమిటి? ఐదేళ్ళు పూర్తయింది. జలయజ్ఞం కోసం రూ॥ 39 వేల కోట్లు ఖర్చయింది. పూర్తి చెయ్యాలంటే ఇంకా 70 వేల కోట్లు పైగా కావాలి. పూర్తయిన మధ్యతరహా ప్రాజెక్టులు కూడా అవినీతితో పనికిరాని స్థితిలో వున్నాయి. ఒక్క ఎకరానికి చుక్కనీరు అందలేదు.

(తరువాయి 2వ పేజీలో)

## అంతర్జాతీయ కార్మికవర్గ దీక్షాదినం మేడే వర్ధిల్లాలి!

# కామ్రేడ్ కానూసన్యాల్ ప్రథమ వర్ధంతి సభ

**సిలిగురి 23-3-11 :**

కానూదా ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆదివాసీ రైతులు, వ్యవసాయ కూలీలు, టీ తోట కార్మికులు, యువకులు, విద్యార్థులు సిలిగురి పట్టణంలో సిపిఐ (ఎం-ఎల్) ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పెద్ద ఎత్తున పాల్గొని ఘనంగా నివాళులర్పించారు. వర్ధంతిసభకు ముందుగా పట్టణంలోని హిల్‌కార్ట్‌రోడ్ పొడవునా ఎర్రజెండాలతో, నినాదాలతో ప్రదర్శన నిర్వహించారు. పశ్చిమ బెంగాల్ పార్టీ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని 'డిమాండ్స్‌డే'గా పాటించమని పిలుపునిస్తూ రాష్ట్ర కమిటి కార్యదర్శి కా॥ సుబ్రతోబసు ప్రజలకు సంబంధించిన పది డిమాండ్స్‌ను, వాటిని సాధించుకొనేందుకు చేపట్టవలసిన ఆందోళన, ప్రచార కార్యక్రమాలను ప్రజల ముందుంచారు. వాటిలో ఆహార ధాన్యాల వ్యాపారంలో భవిష్య వాణిజ్యాన్ని నిషేదించాలని, ఆహార పదార్థాల మరియు ఇతర నిత్యావసరాల అధిక ధరలను తగ్గించాలని, సాధారణ ప్రజానీకంపై కొనసాగుతున్న రాజ్యహింసను ఆపివేయాలని, 'ఉపా' వంటి క్రూర చట్టాలను రద్దు చేయాలని, ఆపరేషన్ గ్రీన్‌హంట్ ఆపివేయాలని, డా॥ బినాయక్ సేన్‌తో సహా రాజకీయ ఖైదీలందరినీ బేషరతుగా విడుదల చేయాలనేవి ఆ డిమాండ్స్‌లో ఉన్నాయి.

సమాజంలోని ప్రజలందరికీ అణచివేతల నుండి విముక్తి కలిగించే సామాజిక వ్యవస్థ సాధన కోసం అవిశ్రాంత పోరాటం సల్పిన స్ఫూర్తి ప్రదాతగా కా॥ కానూసన్యాల్ మన ముందున్నారని కా॥ సుబ్రతో ఈ సందర్భంగా పేర్కొన్నారు. సిపిఐ (ఎం-ఎల్) నిజాయితీగా మనదేశంలో సోషలిస్టు సామాజిక వ్యవస్థ నిర్మాణాన్ని నిజం చేయటం కోసం పోరాడుతున్నదనీ, భారత విప్లవోద్యమ గొంతుక అయిన కామ్రేడ్ కానూసన్యాల్‌కు ఇదే తగిన నివాళి అవుతుందన్నారు.

సిపిఐ(ఎం-ఎల్) సీనియర్ నాయకులు, కేంద్రకమిటి సభ్యులు కా॥ అసిత్‌సిన్హా మాట్లాడుతూ 'నగ్జల్బరీపై మరికొంత వివరణ' డాక్యుమెంట్‌ను వెలువరించిన అనంతరం కా॥ కానూసన్యాల్ తన రాజకీయ జీవితంలో 30 సంవత్సరాల కాలాన్ని కమ్యూనిస్టు విప్లవకారుల ఐక్యతను సాధించటానికి వెచ్చించారనీ, దీనిని మరింత ముందుకు కొనసాగించాల్సిన అత్యావశ్యకతను నొక్కిచెప్పారు.

ఇంకా ఈ సభలో మాట్లాడిన వారిలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు కామ్రేడ్ స్వదేష్ బెనర్జీ, అసిమ్‌ఘోష్; కార్మిక నాయకులు ప్రదీప్ దేవనాథ్, రామ్‌గణేష్‌బారక్; రాష్ట్ర కమిటీ సభ్యులు కా॥ దీపు హాల్డర్, ఖుదా మల్లిక్‌లు కా॥ కానూదాకు నివాళులర్పిస్తూ మాట్లాడారు. ఈ వర్ధంతి సభకు డార్జిలింగ్ జిల్లా పార్టీ కార్యదర్శి కా॥ జోగేన్ విశ్వకర్మాకర్ అధ్యక్షత వహించారు. ◈

## కామ్రేడ్ మద్దికాయల లక్ష్మమ్మకు నివాళులు

కామ్రేడ్ లక్ష్మమ్మగారు(85) తెలంగాణా పోరాట కాలంలో చిన్న వయసులోనే బాలకళాకారిణిగా రాజకీయ జీవితం ప్రారంభించారు. పోరాట విస్తరణలో భాగంగా మానుకోట ప్రాంతంలో ఆదివాసులతో మమేకమై కామ్రేడ్ కమలక్కతోపాటు సాంస్కృతిక బృంద సభ్యురాలిగా కృషిచేశారు. పోరాట విరమణ అనంతరం కూడా 1960ల వరకూ రహస్య, అర్ధరహస్య పద్ధతులలో పనిచేశారు.

కామ్రేడ్ ఓంకార్‌గారి జీవిత సహచరిగా కూడా సుదీర్ఘకాలం రాజకీయ, ప్రజారంగాలలో చురుకైన పాత్ర నిర్వహించారు. అనేక ఆటుపోట్లను ఎదుర్కొని నిలిచారు. 24-4-11న గుండెపోటుతో మరణించిన కామ్రేడ్ లక్ష్మమ్మకు 'జనశక్తి' జోహార్లర్పిస్తూ, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపాన్ని తెలియజేస్తున్నది.

**– సంపాదకుడు**

**బానిస...** (మొదటి పేజీ తరువాయి)

చల్లార్చబూనారు. అయినా ట్యునీషియా, ఈజిప్టులలో ప్రజానీకం తమ పోరాటాన్ని కొనసాగిస్తున్నారు. ప్రజాభిప్రాయానికి తలవంచాలంటూ నీతులు చెప్పిన అమెరికా సామ్రాజ్యవాదం యిప్పుడు పోరాడుతున్న ట్యునీషియా, ఈజిప్టు ప్రజలను తుపాకులకెర చేస్తున్నది. అయినా ఆఫ్రికా ప్రజలలో పెల్లుబుకుతున్న అశాంతితో అది బెంబేలెత్తుతున్నది. ఆఫ్రికా దేశాల ప్రజల ఉద్యమాలను అణచివేసేందుకూ సైనిక స్థావరాల నేర్పాటుచేసే దీర్ఘకాల పథకంతో ప్రజలను రక్షించటమన్న సాకుచెప్పి సామ్రాజ్యవాద దేశాలు లిబియాపై దురాక్రమణకు పూనుకున్నారు. బాంబు దాడులతో లిబియా ఆర్థిక నిర్మాణాలను నాశనంచేసి దానిని లోబరచుకునేందుకు పూనుకున్నాయి. విమానాలు ఎగరకుండా చూడాలన్న ఐరాస తీర్మానాన్ని లిబియాపై యుద్ధంగా మార్చాయి. పాత నాయకులను తొలగించి, కొత్త వారిని తెచ్చినా ప్రజాఆందోళనలు కొనసాగుతున్నందున సిరియా, ఎమెన్, బెహరీన్ తదితర అరబ్ దేశాలలో ప్రజా ఉద్యమాలను అణచివేసేందుకు పూనుకుంది. పాలకులను మార్చే ఎత్తుగడ స్థానంలో ప్రస్తుత పాలకులను కాపాడేందుకు ప్రజలపై పాశవిక నిర్బంధకాండకు పూనుకుంది. అదనపు సైనిక బలగాలను తరలించి అక్కడి పాలకులను రక్షించేందుకు పూనుకుంది.

తీవ్రమైన రాజకీయ, ఆర్థిక సంక్షోభం సామ్రాజ్యవాదుల మధ్య వైరుధ్యాలను పదునెక్కించింది. లిబియాపై దురాక్రమణకు అవి సహకరించుకున్నా ఆఫ్రికాలో ఆధిపత్య స్థాపన కొరకు అవి పడుతున్న పోటీ వాటి సహకారాన్ని బీటలు వారిస్తున్నాయి. ఐవరికోస్టులో ఫ్రెంచి సైనిక జోక్యాన్ని అమెరికా సమర్థించినా, పశ్చిమాసియా దేశాలన్నింటా ఫ్రాన్సు ఆధిపత్యం స్థిరపడకుండా చూసేందుకు జాతులమధ్య వైరుధ్యాలను, వైషమ్యాలుగా అమెరికా రెచ్చగొడుతున్నది. సంక్షోభం కారణంగా తగ్గిపోతున్న డాలరు విలువను నిలబెట్టుకునేందుకు యూరపు సామ్రాజ్యవాదులపై ఉద్దీపనా పథకాలు చేపట్టమని అమెరికా చేస్తున్న ఒత్తిడిని జర్మనీ, ఫ్రాన్సులు వ్యతిరేకిస్తున్నాయి. అమెరికా డాలరు బలహీనతను వినియోగించుకుని తన ఎగుమతులు పెంచుకుంటున్న, తద్వారా జర్మనీ పరిశ్రమలు మాంద్యతలో పడకుండా చూస్తున్న జర్మనీ చర్యలపట్ల అమెరికా సామ్రాజ్యవాదులు అసంతృప్తితో వున్నారు. రాజకీయ స్థాయిలో సామ్రాజ్యవాద ద్రవ్యసంస్థలైన ప్రపంచ బ్యాంకు, అంతర్జాతీయ ద్రవ్యనిధి, ప్రపంచ వాణిజ్య సంస్థలలో సంస్కరణలు తేవాలన్న అంశంగా వారిమధ్య వైరుధ్యాలు వ్యక్తమౌతున్నాయి.

అరబ్ ప్రజల పోరాటాలూ, ప్రపంచంలో సాగుతున్న సామ్రాజ్యవాద వ్యతిరేక ఆందోళనలూ దోపిడీ, అణచివేతలకు వ్యతిరేకంగా ప్రజల పోరాట సంసిద్ధతను తెలుపుతున్నాయి. అదేసమయంలో ఈ పోరాటాలకూ, ఆందోళనలకూ కార్మికవర్గం నాయకత్వం వహించి నడిపించాల్సిన అవసరాన్ని కూడా తెలుపుతున్నాయి. ప్రజల ఆగ్రహాన్ని, ఆవేశాన్ని స్థానిక పాలకులపైకి మరల్చి దోపిడీ వ్యవస్థనూ, సామ్రాజ్యవాదాన్ని ప్రజాగ్రహాన్నుండి తప్పించే ప్రయత్నాలు పైచేయి సాధించటం కార్మికవర్గ అగ్రగామి దళమైన కమ్యూనిస్టు ఉద్యమ బలహీనతను సూచిస్తున్నాయి.

సామ్రాజ్యవాద దోపిడీ, అణచివేత, యుద్ధాలకు వ్యతిరేకంగా ప్రపంచ మానవాళి-పీడిత జాతుల సంఘటిత పోరాట మొక్కటే వారి విముక్తి మార్గమనీ, ఈ మార్గంలో పీడిత ప్రజలను నడిపించే కర్తవ్యాన్ని కార్మికవర్గం చేపట్టాలనీ పరిస్థితి మరోసారి తేటతెల్లం చేస్తున్నది.

సామ్రాజ్యవాదుల ఆదేశాలతో అమలు జరుపుతున్న నూతన ఆర్థిక విధానాలతో దేశ ఆర్థిక జీవనం సామ్రాజ్యవాదుల పరమయింది. దేశ పారిశ్రామిక రంగం, ఉత్పాదనా పరిశ్రమలూ విదేశీ పెట్టుబడిదారుల వశమయ్యాయి. విదేశీ పెట్టుబడుల మదుపుపై పరిమితులు విధిస్తున్నట్లు చెప్పుకుంటున్నప్పటికీ, వాటికి ఎక్కడలేని స్వేచ్ఛనూ ఇచ్చారు. నామమాత్రంగా విధించిన పరిమితులను ఎత్తివేసేందుకు కూడా పూనుకుంటున్నారు. ధనాఢ్య వర్గాల విలాసాలను తీర్చే పరిశ్రమలు విస్తరిస్తుండగా, ప్రజల అవసరాలను తీర్చే పరిశ్రమలన్నీ మూతపడిపోతున్నాయి. కార్మికులు ఉపాధిని కోల్పోతున్నారు. నేటికీ 80శాతంపైగా కార్మికులు ఎలాంటి హక్కులూ లేకుండా అనియత రంగంలోనే పనిచేస్తున్నారు. సంఘటితరంగంలో కూడా 8 గంటల పనిదినం వంటి మౌలిక హక్కులను సైతం కాలరాస్తున్నారు.

వ్యవసాయరంగంలోకి సామ్రాజ్యవాద పెట్టుబడుల చొరబాటు పెరగటంతో రైతాంగం తీవ్ర సంక్షోభాన్నెదుర్కొంటున్నారు. సామ్రాజ్యవాదుల దోపిడీ పరిశ్రమలకు బంధిత ఉత్పత్తిదారులుగా రైతాంగాన్ని దిగజార్చేందుకు భారత దళారీ పాలక వర్గాలే ఈ సంక్షోభాన్ని సృష్టిస్తున్నాయి. సాగుకొరకు రైతాంగానికి అవసరమయ్యే ఉత్పాదకాల (సాగునీరు, కరెంటు, ఎరువులు, పురుగుమందులు, విత్తనాలు) ధరలన్నింటినీ పెంచివేశారు. పెట్రోలు, డీజిలు, ఇనుము, బొగ్గు, సహజవాయువు తదితర సరుకులన్నింటినీ దిగుమతి చేసుకుంటే చెల్లించే ధరలనే వీటి అమ్మకం ధరలుగా నిర్ణయిస్తున్న ప్రభుత్వం వ్యవసాయ ఉత్పత్తులకు మాత్రం కనీస మద్దతు ధరను అతి తక్కువగా నిర్ణయిస్తున్నది. ఆ ధర కూడా రైతాంగానికి దక్కకుండా ప్రభుత్వ కొనుగోలు సంస్థలను రంగంనుండి తప్పించి వ్యవసాయ మార్కెట్టును ప్రైవేటు వ్యాపారుల పరం చేస్తున్నది. ఈ క్రమంలో రైతాంగాన్ని అప్పుల ఊబిలో పడవేసి భూములనుండి గెంటివేస్తున్నది. మిగిలిన వారికి కాంట్రాక్టు సాగే ప్రత్యామ్నాయంగా చూపుతున్నది. సెజ్‌లు, కారిడార్లు, ప్రాజెక్టుల అభివృద్ధిపేరిట రైతాంగంనుండి బలవంతంగా ➡ భూమిని లాగివేసుకుంటున్నది. దాదాపు 160 సెజ్‌లకోసం వేలాది ఎకరాలు రాష్ట్రంలో గుంజుకున్నా ఇంతవరకూ ఒక్క సెజ్ కూడా పూర్తిస్థాయిలో ఏర్పడలేదు. అవి కల్పిస్తాయన్న ఉపాధికల్పన ఎండమావిగానే వుంది. దీనితో సాగు భూమి విస్తీర్ణం తగ్గటంతో వ్యవసాయ కూలీలు ఉపాధిని కోల్పోతున్నారు. దీనికి తోడు చిన్న, మధ్యతరహా దేశీయ పరిశ్రమలన్నీ విదేశీ పోటీకి తట్టుకోలేక మూతపడుతున్నాయి. నిరుద్యోగ సమస్య తీవ్రమయింది. పట్టణాలలో యిళ్లు నిర్మించే రంగంతప్ప మరో ఉపాధి కల్పనా రంగం లేకుండా పోయింది.

సామాజిక సంక్షేమ కార్యకలాపాలను వదలివేసిన ప్రభుత్వం విద్య, వైద్యం సేవారంగాలను ప్రైవేటీకరించింది. ప్రతి సేవకూ సొమ్ము చెల్లించి కొనుగోలు చేయవలసిన సరుకులుగా మార్చింది. దీనితో భారత ప్రజల జీవనం దుర్భరమైంది.

నూతన ఆర్థిక విధానాల అమలుతో దేశ సహజ, ఆర్థిక, ద్రవ్య వనరుల తరలింపు విదేశాలకు ఒక ప్రవాహంలా సాగుతున్నది. ఇనుప ఖనిజం ఒక్క కర్ణాటక రాష్ట్రంనుండి 12 కోట్ల టన్నులు ఎగుమతి జరగ్గా అందులో 3 కోట్ల టన్నులు అక్రమంగా తరలించారు. ఈ అక్రమార్జనల్లో రాజకీయనేతలూ, అధికారగణాలూ వాటాలు పొందాయి. వీరు బడాబూర్జువావర్గంతో కలసి దేశ వనరులను కొల్లగొడుతున్నారు. గత ఏడాది తామర తంపరగా బయటకొచ్చిన కుంభకోణాలన్నింటినీ కలిపితే దేశసంపద ఎంత స్థాయిలో దోచుకోబడిందో అంచనాలకు అందటంలేదు. రాయల్టీ, పన్నుల రూపంలో ప్రభుత్వానికి రావలసిన ఆదాయ నష్టాన్నే చెబుతున్నారుగానీ మొత్తం సంపద విలువ గురించి మాట్లాడటంలేదు. పాలకవర్గాల్లోని ముఠా తగవులతో యివి బయటపడ్డాయిగానీ, అక్రమార్జనలు దేశ మూల్గులు పీల్చివేస్తున్న సమస్యగా వీరికి పట్టలేదు.

నానాటికీ దుర్భరమౌతున్న జీవన పరిస్థితుల్లో ప్రజల్లో అశాంతి బ్రద్దలవుతున్నది. ఈ అశాంతి వెల్లువెత్తి ప్రజా ఉద్యమంగా మారకుండా చూసేందుకు పాలకులే ఆకర్షణీయ నినాదాలతో వస్తున్నారు. ఆహార హక్కు, విద్యాహక్కు, సమాచారహక్కు అంటూ చట్టాలు చేస్తున్నారు. పిల్లలందరకూ విద్యనందించగల ప్రభుత్వ విద్యాలయాలను దిగనాసిల్ల చేసి, ప్రైవేటు పాఠశాలలకు నెట్టిన ప్రభుత్వమే, ప్రైవేటు స్కూళ్లలో పేద పిల్లలను తానే చేర్పిస్తాననీ, ఫీజులు తానే చెల్లిస్తాననీ పథకాలు ప్రవేశపెడుతున్నది. విమానం టిక్కెట్టు కొనలేని వారికి విమానం ఎక్కే హక్కు వున్నదన్నట్టుగా, పేదలను చదువుకు దూరంచేసి విద్యాహక్కు చట్టాన్ని చేస్తున్నది. అవినీతి, అక్రమార్జనల పర్వం బయటపడటంతో తామే అవినీతి వ్యతిరేక పోరాటాలను చేపడుతున్నారు. ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలే దీనికి మూలకారణమన్న వాస్తవాన్ని దాచిపెట్టి, వ్యక్తుల పేరాశే అవినీతికి మూలంగా చిత్రిస్తున్నారు. అలా సాగిందే అన్నా హజరేల పోరాటమన్నది! ఈ వ్యవస్థకు వ్యతిరేకంగా ప్రజలు సంఘటిత పోరాటాలకు పూనుకోకుండా ప్రక్కదారి పట్టించి, లక్ష్యాన్ని గురినుండి తప్పించేందుకే పాలకవర్గాలు ఇలాంటి పోరాటాలను అకాశానికెత్తి కీర్తిస్తున్నాయి.

అయిన్పటికీ వేతనాలు, పని పరిస్థితుల మెరుగుదల కొరకు కార్మికులూ; ఉపాధి సౌకర్యాలూ, వేతనాల మెరుగుదల కొరకు వ్యవసాయ కూలీలూ; గిట్టుబాటు ధరల కొరకు, ఉత్పాదకాలరేట్ల తగ్గింపు కొరకు రైతాంగమూ; వివక్షకూ, అణచివేతకూ వ్యతిరేకంగా దళితులూ, మహిళలూ; విధ్వంసానికి గురవుతూ జీవన రక్షణ కొరకు ఆదివాసులూ, నిర్వాసితులూ పోరాటాలు సాగిస్తున్నారు.

ప్రజల ఈ సంఘటిత పోరాటాలను అణచివేసేందుకు ప్రజలను కుల, మత, ప్రాంతీయ విద్వేషాలకు లోనుచేసి వారి పోరాట పటిమను మొద్దుబార్చేందుకు పాలకులు ప్రయత్నిస్తున్నారు. అదే సమయంలో పాశవిక నిర్బంధకాండకు పూనుకుంటున్నారు. సోంపేట, కాకరాపల్లి...ఎక్కడ ప్రజలు హక్కుల కొరకు పోరాడినా సమాధానం తుపాకీ తూటాలే. ప్రజల ప్రతికదలికా చట్ట విరుద్ధ చర్యగా మార్చే చట్టాలతో నిర్బంధ యంత్రాంగానికి కోరలు తొడుగుతున్నారు.

భారత కార్మికవర్గం ఈ ప్రపంచ, దేశీయ పరిస్థితిని ఆకళింపుచేసుకుని తన కర్తవ్యాలను నిర్దేశించుకోవాలి. శ్రామికవర్గ దీక్షాదినంనాడు ఈ కర్తవ్యాల నిర్వహణకు పునరంకితమవ్వాలి.

సామ్రాజ్యవాదం, ప్రధానంగా అమెరికా సామ్రాజ్యవాదం ప్రపంచ ప్రజలకు శతృవుగా వుంది. ప్రపంచాధిపత్యంకొరకు దురాక్రమణలు సాగిస్తున్న సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా ప్రజలనూ, జాతీయ శక్తులనూ సమీకరించేందుకు పూనుకోవాలి. సామ్రాజ్యవాదులకు వ్యతిరేకంగా పోరాడుతున్న దేశాలకూ, జాతులకూ, ప్రజలకూ బాసటగా నిలవాలి.

భారత సామాజిక వ్యవస్థలోని మౌలిక సమస్యల్లో ప్రధానమైనది వ్యవసాయ సమస్య. దున్నేవానికే భూమి కేంద్ర నినాదంగా సాగే పోరాటం మాత్రమే వ్యవసాయ సమస్యను పరిష్కరిస్తుంది. సామ్రాజ్యవాద ఆధిపత్యాన్ని దెబ్బతీస్తుంది.

నేటి మేడే సామ్రాజ్యవాద-ప్రధానంగా అమెరికా సామ్రాజ్యవాద దురాక్రమణలకు వ్యతిరేకంగా వెల్లివిరుస్తున్న పోరాట చైతన్యదినం. సామ్రాజ్యవాద ఆధిపత్యానికీ, ఫ్యూడలు దోపిడీ అణచివేతలకు మంగళం పాడే పోరాటాల సమీకరణ దినం. బానిస శృంఖలాలను త్రెంచివేసే దీక్షా దినం. ప్రపంచ మానవాళి ఉజ్వల భవిష్యత్తు అనివార్యంగా సోషలిజంలోనే వుందన్న వాస్తవానికి ప్రతీకగా నిలుస్తున్న దినం.

సామ్రాజ్యవాద, భూస్వామ్య, దళారీ బూర్జువా పాలనకు వ్యతిరేకంగా విప్లవిద్దాం! సోషలిజం అజేయమని చాటుదాం! ◈

**పేదరిక...** (మొదటి పేజీ తరువాయి)

ఈ ఐదేళ్లలోనూ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఖర్చు 100 కోట్ల రూ॥లు దాటింది. ఏ దశలోనూ ప్రకటిత జనభాలో సగం మందికి కూడా ఉపాధి కల్పించలేదు. కల్పించిన వారికి ప్రకటిత పనిదినాలలో సగం కూడా పని చూపలేదు. వారికి వేతనాల చెల్లింపు కూడా ఆ స్థితిలోనే వుంది. ఇరు పథకాలలోనూ గుత్తేదారుల జేబులే నిండాయి.

ఇదిలావుంటే సాగునీరందించే జలయజ్ఞం వ్యయాన్ని, పేదలకు ఇళ్లు నిర్మించే కార్యక్రమ వ్యయాన్ని వృథా ఖర్చని ప్రణాళికా సంఘం ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వాన్ని విమర్శించింది. ఇందులో జరిగిన అవినీతి, గుత్తేదారులు అంచనాలు పెంచి సాగించిన దోపిడీ గురించి కాదు దాని విమర్శ. ఇంత ఖర్చు చేస్తే వచ్చే ఆదాయమెంతని లెక్కవేసి వృథా ఖర్చని విమర్శించింది. ప్రపంచంలో మూడు శాతం నీటితో, నాలుగు శాతం భూమితో 17 శాతం జనాభాను పోషిస్తున్న వ్యవసాయరంగానికి బాసటగా నిలవటం వృథా ఖర్చుగా కన్పిస్తున్నది. జాతీయ నమూనా సర్వే ప్రకారం రైతుల నెలసరి ఆదాయం 2500 రూ॥లోపుగావున్నా వారి ఆదాయాన్ని పెంచే చర్యలూ, ప్రణాళికా దానివద్దలేవు. ప్రభుత్వ ఉద్యోగికి చెల్లించే కనీస వేతనం నెలకు 15 వేలుగా అంగీకరించిన ప్రణాళికా సంఘం, గ్రామీణ జనాభా ఆదాయాన్ని కనీసం ఆ స్థాయికి పెంచే ప్రయత్నాలు కూడా చెయ్యదు.

భారత దోపిడీ వర్గాల ప్రయోజనాలకు సేవ చేయటానికే ఏర్పడిన ఈ సంస్థలకు బూర్జువాల ఆస్తులు పెరగటం ఆర్థికాభివృద్ధిగా కన్పిస్తుంది. ప్రజల ఆదాయాన్ని పెంచే ఏ పథకమైనా వృథా ఖర్చుగానే కన్పిస్తుంది. ◈

# ఐవరి కోస్టు ఆధిపత్యం కోసం ఫ్రాన్సు సైనిక దురాక్రమణ




**పశ్చిమాఫ్రికాలోని** ఐవరీకోస్టు- యూరపు నుండి వలసవాదుల ప్రవేశానికి ముందు (15వ శతాబ్దంలో) అనేక జాతుల నివాస ప్రాంతంగా వుండేది. రాచరిక పాలనలో వుండేది. 'అగ్ని' రాజవంశం వీరందరినీ ఏక పాలనలోకి తెచ్చేందుకు పూనుకుంది. రాజు అషాంతి కేంద్రీకృత పాలనా రాజకీయ వ్యవస్థను ప్రతిపాదించాడు. మూడుతరాల పాలన తర్వాత ఆ రాజ్యం విడిపోయింది. అయినప్పటికీ ఒక భాగానికి రాజైన బౌలీ, ఫ్రాన్సు దాడిని ప్రతిఘటించాడు.

బానిస వ్యాపారం కోసమే యూరోపియన్లు పశ్చిమాఫ్రికాకు వచ్చారు. పశ్చిమాఫ్రికాలోని ఇతర ప్రాంతాలతో పోల్చినప్పుడు ఐవరీ కోస్టు బానిస వ్యాపారానికి తక్కువగానే గురయిందని చెప్పవచ్చు. 1482లో పశ్చిమాఫ్రికాకు చేరిన పోర్చుగీసు, డచ్చి వ్యాపారులు రేవు సౌకర్యాలున్న ఇతర ప్రాంతాలనెంచు కోవటంతో ఐవరీ కోస్టులో బానిస వ్యాపారం తక్కువగానే సాగేది. 1637లో మొదటి సారిగా ఫ్రాన్సు, పొరుగునున్న ఘనాలో కాలు మోపింది. 1843-44 నాటికి ఐవరీ కోస్టులో ఫ్రాన్సు తిష్ట వేయగలిగింది. బాస్సాం, అస్సీన ప్రాంతాలను తన రక్షిత ప్రాంతాలుగా చేసుకుంది. స్థానిక పాలకులతో ఒప్పందాలు చేసుకుని కోటలు నిర్మించింది. తీరప్రాంతం నుండి లోతట్టుకు విస్తరించింది. ఈ విస్తరణలో ఫ్రెంచి ప్రభుత్వ విధానం కాక, వ్యాపారులూ క్రిస్టియను మిషనరీలూ ప్రధాన పాత్ర వహించారు. 1871లో జర్మనీ యుద్ధంలో ఫ్రాన్సు ఓడిపోయింది. దీనితో పశ్చిమాఫ్రికాలోని శిబిరాలను, వ్యాపార కేంద్రాలను అక్కడి వ్యాపారుల కప్పగించింది. మార్సెల్స్ నుండి వచ్చిన వ్యాపారి ఆర్డర్ వెర్డర్ ఈ ప్రాంతానికి 1878లో కోట్ డి ఐవరీ (ఐవరీ కోస్టు) అని పేరుపెట్టాడు. 1886లో తిరిగి ఫ్రాన్సు ప్రభుత్వం ప్రత్యక్ష పాలనకు పూనుకుంది. లోతట్టు ప్రాంతానికి విస్తరించే విధానాన్ని చేపట్టింది.

1890 నాటికి తీరప్రాంతపై ఫ్రాన్సు ఆధిపత్యం నెలకొంది. బ్రిటను దీనిని గుర్తించింది. 1893లో ఐవరీ కోస్టును ఫ్రాన్సు వలసగా ప్రకటించారు. అదే ఏడాది బ్రిటన్‌తోనూ, లైబీరియాతోనూ ఒప్పందాలు చేసుకుని తూర్పు, ఉత్తరాల వైపు సరిహద్దులు నిర్ణయించుకున్నారు. దక్షిణాన సముద్రంవుంది. ఐతే ఉత్తర సరిహద్దును నిర్ణయించకుండా వదిలి వేసింది. ఆ వైపు నున్న అప్పర్ వోల్టా (ప్రస్తుతం బర్కినా ఫోసో), సూడాన్‌లలో కొన్ని భాగాలను తన ఆధీనంలోకి తెచ్చుకునే ఉద్దేశంతో ఫ్రాన్సు ప్రయత్నాలు చేసింది.

ఎగుమతులు చేసేందుకు వీలుగా పంటలు పండించటమన్న విధానంతో ఫ్రాన్సు పాలన సాగింది. కోకో, కాఫీ, పామాయిలు తోటల పెంపకం జరిగింది. ఫ్రాన్సు నుండి వలస వచ్చిన వారు తీర ప్రాంతమంతటా ఈ ప్లాంటేషన్లు వేశారు. ఈ ప్లాంటేషన్లలో మూడింట రెండువంతులు ఫ్రెంచి దేశీయుల ఆధీనంలోనే వుండేవి. స్థానిక ప్రజలతో బలవంతంగా వెట్టిచాకిరి చేయించేవారు. పశ్చిమాఫ్రికాలోని ఇతర దేశాలలో బ్రిటను, ఫ్రాన్సు నుండి వలస వచ్చినవారి సంఖ్య తక్కువ. వచ్చినవారిలో ఎక్కువ మంది ప్రభుత్వాధికారులుగా వుండేవారు.

వలస పాలన ప్రారంభకాలమంతా ఘర్షణలతో సాగింది. ఫ్రెంచి ప్రభుత్వం సైన్యాన్ని ఉత్తర దిశగా పంపి కొత్త ప్రాంతాన్ని ఆక్రమించుకుని సైనిక పోస్టులు పెట్టేది. ఈ విస్తరణకు తీవ్ర ప్రతిఘటన ఎదురైంది. ఈ ప్రతిఘటనల్లో పెద్దది వసౌలౌ సామ్రాజ్యం నెలకొల్పిన సమోరి తురే నుండి ఎదురయింది. ప్రస్తుతమాలి, గినియా, బర్కినాఫాసో, ఐవరీ కోస్టులలో సమోరి రాజ్యం ఉండేది. వీరికి స్వంత తుపాకులు, వాటిని మరామత్తు చేయగల సామర్థ్యం ఉండేది. సమోరి పోరాటానికి ప్రజలమద్దతు వుండేది. 1898 నాటికిగానీ ఫ్రాన్సు దీనిని అణచివేయలేకపోయింది.

అయినా తిరుగుబాటులు కొనసాగాయి. వలస పాలన నిర్వహణ కొరకు ఫ్రాన్సు 1900లో తల పన్నును విధించింది. ఇది స్థానిక రాజుల నుండి కప్పం వసూలు చేయటంగా పరిగణించి అనేక తిరుగుబాట్లు జరిగాయి. వీటి ఫలితంగా ఫ్రాన్సు "ఇముడ్చుకునే-కలగలిసే'' విధానమన్న దానిని అనుసరించింది.

ఈ ప్రాంతంలో బ్రిటన్ "విభజించి-పాలించే" విధానాన్ని అనుసరించగా, ఫ్రాన్సు యిముడ్చుకునే విధానం అనుసరించింది. ఫ్రెంచి సంస్కృతి ఉత్కృష్ట మైనదన్న భావనతో సాగిన ఈ విధానం ఐవరీ కోస్టులో ఫ్రెంచి భాష, విద్య, చట్టాలు, ఆచారాలను ప్రవేశపెట్టింది. కలగలిసిపోయే విధానం కూడా వలస కంటే ఫ్రాన్సుదే వున్నత స్థాయి అన్న భావనతోసాగి వలస పాలకులకూ, వలస పాలితులకూ ప్రత్యేక పాలనా, శాసన వ్యవస్థలను రూపొందించింది. ఫ్రెంచి ప్రయోజనాలకు హానికలుగని మేరకు స్థానిక ఆచారాలను అనుమతించారు. ఈ విధానంలో ఆఫ్రికనులకు ఎటువంటి రాజకీయ హక్కులూ ఉండేవికావు. వారు చెల్లించాల్సిన పన్నుకు ప్రతిగా వారితో బలవంతంగా ప్లాంటేషన్లలోనూ, గనులలోనూ, రేవుల్లోనూ కూలీలుగా పనిచేయించేవారు. 1980 నాటికి ఫ్రెంచి విద్యతో పడమరీకరించబడిన శిష్టవర్గమొకటి యిముడ్చుకునే విధానంతో ఏర్పడింది. పాలకులకూ, ఆఫ్రికన్లకూ మధ్యదొంతరగా వీరినుపయోగించారు. వీరిలో అతి కొద్ది మందికి ఫ్రెంచి పౌరసత్వం ఇచ్చారు.

రెండవ ప్రపంచ యుద్ధం ముగిసిన తర్వాత ఫ్రాన్సు కొన్ని పాలనా సంస్కరణలు తెచ్చింది. కొందరికి పౌర సత్వాన్ని , రాజకీయ హక్కులనూ యిచ్చింది. ఫ్రెంచి వ్యతిరేక భావనలను కట్టడి చేసి యధాతథ స్థితిని కొనసాగించేందుకు కొద్ది శిష్టవర్గాన్ని సంతృప్తి పరిచే విధానంలో భాగంగానే ఈ సంస్కరణలు జరిగాయి. యిముడ్చుకొనే విధానాలవల్ల సమకూరుతున్న ప్రయోజనాల రీత్యా ఈ విద్యావంతులు ఫ్రెంచి పాలన ముగియాలని భావించినా, యిముడ్చుకునే విధానం ద్వారా పాలకులతో సమానత్వాన్ని పొందగలమని విశ్వసించి మద్దతిచ్చారు. వారి ఆశలు అడియాస లయ్యాయి. 1953 వరకూ అమలు జరిగిన ఈ విధానం ఫ్రెంచి ఆధిపత్య స్థానాన్నే బలీయం చేయటంతో స్వాతంత్ర్యం కావాలన్న డిమాండును ముందుకు తెచ్చారు.

ఫ్రెంచి విస్తరణను ప్రతిఘటించిన బావోలే రాజు కొడుకు ఫెలిక్స్ హౌఫట్‌బాయిగ్నీ 1944లో కోకో రైతుల యూనియన్‌ను స్థాపించాడు. ఫ్రెంచి ప్లాంటేషన్ యజమానులకు అనుకూలంగా ప్రభుత్వ విధానా లున్నాయని ప్రకటించి తమ కోకో తోటలలో పని చేయటానికి పొరుగు దేశాల నుండి వలస వచ్చిన వారిని పెట్టుకుని వారికి జీతాలు చెల్లించేవారు. దీనితో బాయిగ్నీ గుర్తింపు పొందాడు. ఫ్రెంచి ప్రభుత్వం వెట్టిచాకిరిని రద్దు చేయాల్సి వచ్చింది. బాయిగ్నీ ఫ్రెంచి పార్లమెంటుకు ఎన్నికయ్యాడు. ప్రభుత్వం అతన్ని మంత్రిగా నియమించింది. ఒక యూరపు దేశంలో ఆఫ్రికన్ మంత్రి కావటం అదే మొదటిసారి.

ప్రజల్లో పెల్లుబుకుతున్న వ్యతిరేకతతో ఫ్రెంచి ప్రభుత్వం 1956లో సముద్రాంతర సంస్కరణల చట్టాన్ని చేసింది. 1935 భారత చట్టాన్ని పోలిన ఈ చట్టం అనేక అధికారాలను బదలాయించి, ఐవరీ కోస్టును ఫ్రెంచి యూనియన్‌లో స్వయం పాలిత ప్రాంతంగా గుర్తించింది. ఈ క్రమంలో 1960లో స్వాతంత్ర్యాన్నిచ్చింది. తన ఆర్థిక ప్రయోజనాలకు తగిన రక్షణ పొందిన తర్వాతే ఫ్రాన్సు అధికార మార్పిడి జరిపింది. ఈ కాలంలో స్వాతంత్ర్యం పొందిన ఆఫ్రికా దేశాలలో నుండి యూరోపియన్ దేశస్తులను పంపించి వేయగా, ఐవరీ కోస్టులో దీనికి భిన్నంగా జరిగింది. 1960లో 30 వేలున్న ఫ్రెంచి జాతీయుల సంఖ్య 1980 నాటికి 80 వేలకు పెరిగింది. ప్లాంటేషను యజమానులు కొనసాగగా, ఉపాధ్యాయులుగా, టెక్నీషియన్లుగా, మేనేజర్లుగా, ప్రభుత్వ సలహాదారులుగా ఫ్రెంచి దేశస్తులు ఐవరీ కోస్టులోకి వచ్చారు. వ్యవసాయ ఉత్పత్తిని పెంచేందుకు బాయిగ్నీ ప్రభుత్వం రైతులకు మంచి రేట్లు యిచ్చింది. దీనితో కాఫీపంటలో బ్రెజిల్, కొలంబియా తర్వాత మూడవ స్థానంలోకి వచ్చింది. ఆనాసపండ్లు, పామాయిలు ఎగుమతుల్లో మొదటిస్థానంలోకి వచ్చింది. దీనితో పొరుగు దేశాల నుండి శ్రామికుల వలస పెరిగింది. దేశంలో వుండే జాతుల వైవిధ్యం పెరిగింది. బాయిగ్నీ ప్రభుత్వం జాతుల మధ్య వైరుధ్యాలు పెంచకుండా సమన్వయం పాటించింది.

1993లో చనిపోయే వరకూ అధ్యక్షుడిగా వున్న బాయిగ్నీ ఫ్రాన్సుతో ఘనిష్ట సంబంధాలు ఏర్పరిచాడు. తన పాలనాకాలంలో యమొసొక్రోను (తానుపుట్టిన వూరు) రాజధానిగా తీర్చిదిద్దేందుకు చేసిన కార్యక్రమం వివాదాస్పదమైంది. విద్య, అభివృద్ధి, శాంతి, మతానికి కేంద్రంగా రాజధాని నిర్మాణాన్ని బలపరిచేవారు; రాజధాని నిర్మాణానికి వెచ్చించిన ధనం అవినీతితో వ్యర్థమైందనే వారూగా తీవ్ర చర్చలు జరిగాయి. ఏమైనా కలప ఎగుమతి కోసం అడవిని విస్తారంగా నరికి వేయడంతో అతివృష్టి, అనావృష్టి దేశ ఆర్థిక వ్యవస్థను సంక్షోభంలోకి పడవేశాయి. 1980ల చివర్లో వచ్చిన కరువు, ప్రపంచ మార్కెట్లో చక్కెర ధరలు పడిపోవటంతో ఐవరీ కోస్టు విదేశీ రుణం మూడురెట్లు పెరిగింది. మూడు దశాబ్దాల పాలనలో ఒకే ఒక రాజకీయ పార్టీని అనుమతించాడు. ఈ స్థితిలో 1990లో ప్రభుత్వంలో అవినీతికి వ్యతిరేకంగానూ, బహుళ పార్టీ వ్యవస్థను కోరుతూ ప్రభుత్వ ఉద్యోగులూ, విద్యార్థులూ సమ్మెచేశారు. ప్రభుత్వం బహుళపార్టీ వ్యవస్థకు అంగీకరించింది. 1993లో అనారోగ్యంతో బాయిగ్నీ మృతి చెందాడు. తన వారసుడిగా హెన్రీ కోనన్ బీడీని ప్రకటించాడు.

కొత్తగా ఏర్పడిన ప్రతిపక్షాలు విడిపోయి వుండటంతో 1995లో జరిగిన ఎన్నికల్లో బీడీ గెలుపొందాడు. తనకు ప్రధాన ప్రత్యర్థిగా వున్న ఔత్తారా తల్లిదండ్రులు విదేశీయులు కనుక ఎన్నికల్లో పాల్గొనే అర్హత లేదని ప్రకటించాడు. దీని కోసం ఐవరీ కోస్టు పౌరులకు జన్మించినవారే ఐవోరియన్లని నిర్వచనం యిచ్చాడు. పొరుగు దేశాల నుండి వలస వచ్చిన వారు ఐవరీ కోస్టులో గణనీయంగా వుంటారు. దీనితో వీరందరూ ఎన్నికల్లో పాల్గొనే అర్హత కోల్పోయారు. జాతుల మధ్య సంబంధాలలో సమన్వయం పాటించిన బాయిగ్నీ విధానానికి భిన్నంగా బీడీ ఇచ్చిన నిర్వచనం జాతుల మధ్య ఉద్రిక్తతలను పెంచింది. రాజకీయ ప్రక్రియకు దూరం చేయబడ్డ సెక్షన్లలో అసంతృప్తి పెరిగింది.

దీనితో అసంతృప్తి చెందిన సైనికాధికారులు 1999లో తిరుగుబాటు చేశారు. జనరల్ రాబర్టుగుయిని అధికారంలో ప్రతిష్ఠించారు. బీడీ, పారిస్‌లో తలదాచు కున్నాడు. సహాయం పేరిట ప్రపంచబ్యాంకు ఆర్థిక, ద్రవ్య విధానాల నిర్దేశానికి పూనుకుంది. దీనికనుగుణంగానే సైనిక ప్రభుత్వం పొదుపు చర్యల పేరిట వ్యవస్థాగత సర్దుబాట్ల కార్యక్రమం తీసుకుంది.

2000 అక్టోబరులో అధ్యక్ష ఎన్నికలు జరిగాయి. గుయికి ప్రత్యర్థిగా లెఫ్టినెంట్ గబాగో పోటీ చేశాడు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయని చెప్పుకున్నారు కానీ ఓట్ల లెక్కింపు జరిగేలోపు సైన్యంలో అలజడి చెలరేగింది. ప్రజలు రోడ్లమీదకు వచ్చి ప్రదర్శనలు చేశారు. సైన్యం జరిపిన కాల్పుల్లో 180 మంది మరణించారు. ఓట్ల లెక్కింపు జరగకుండానే గబాగో అధ్యక్షుడయ్యాడు. ఈ ఎన్నికల్లో ఔత్తరాకు పోటీచేసే అవకాశం లేకుండా చేశారు. అతని తల్లి దండ్రులు బర్కినా తెగకు చెందిన వారన్న కారణంతో పోటీకి అనర్హుడిని చేశారు. దీనితో జాతుల మధ్య విభజన పెరిగింది. ఫ్రెంచి ప్రభుత్వం గబాగో పాలనను గుర్తించింది. ప్రపంచ బ్యాంకు రుద్దిన కార్యక్రమంతోనూ, ఎగుమతి సరుకుల ధరలు తగ్గినందునా ఆర్థిక సంక్షోభం ప్రజల జీవనాన్ని కఠినం చేసింది.

2002 సెప్టెంబరు 19న గబాగో ఇటలీ పర్యటనలో వుండగా, సైన్యం నుండి తొలగించాల్సివున్న దళాలు తిరుగుబాటు చేశాయి. పర్యటన ఆపివేసి తిరిగి వచ్చిన గబాగో తొలగించబడిన అధ్యక్షుడు గుయా తిరుగుబాటు చేసాడని ప్రకటించాడు. తిరుగుబాటు దారులు అబిడ్‌జాన్ నగరాన్ని ఆక్రమించుకున్నారు. తన పౌరుల రక్షణ కోసమంటూ, ఫ్రాన్సు ఐవరీ కోస్టులో వున్న సైనిక శిబిరం నుండి సైన్యాన్ని నగరంలోకి పంపింది. ఫ్రాన్సు తాను తటస్థంగా వున్నానని చెప్పినా ప్రభుత్వ దళాలకు సహాయపడిందని పరిశీలకులు నిర్ధారించారు. ఈ తిరుగుబాటుకు ఉత్తర ప్రాంత ప్రజల నుండి మద్దతు వచ్చింది. ఔత్తారా తిరుగుబాటును సమర్థించాడు. ఆ రోజు రాత్రి గుయా శవం రోడ్డు మీద పడివుండటాన్ని టివిలు చూపించాయి. అతనితో పాటు మరో 15 మందిని హత్యచేసి రోడ్డుమీద పడవేసి వారే తిరుగుబాటు దారులుగా చూపారని అమెరికా పత్రికలు వాదించాయి. కాగా తిరుగుబాటు అణచే క్రమంలో వారు మరణించినట్లుగా ఫ్రెంచి పత్రికలు రాసాయి. ఔత్తారా ఫ్రెంచి రాయబార కార్యాలయంలో తలదాచుకున్నాడు.

తిరుగుబాటును అణచివేసినా, యుద్ధవిరమణ ప్రకటన జరిగినా శాంతి ఏర్పడలేదు. కోకో, కాఫీ తోటల ప్రాంతంలో ఆందోళన కొనసాగింది. పొరుగునున్న లైబీరియా నుండి వలస వచ్చిన శ్రామికులు ఈ తోటల్లో పని చేస్తున్నారు. ఇంతేకాక సరిహద్దులు వలసవాదులు ఏర్పరిచినవి. సరిహద్దు కిరువైపులా ఒకే తెగకు చెందిన ప్రజలున్నారు. దీనితో లైబీరియా పాలకులు ఐవరీ కోస్టులోని పశ్చిమ భాగంలో కొంత ప్రాంతాన్ని స్వాధీనం చేసుకునేందుకు ఇక్కడ రెచ్చగొట్టే వైఖరిని తీసుకున్నారు. లైబీరియా నుండి సరిహద్దులు దాటకుండా చూసేందుకు ఫ్రాన్సు సైన్యాన్ని పంపింది.

చివరకు ఫ్రాన్సు తెచ్చిన వత్తిడితో గబాగో ప్రతిపక్షంతో శాంతి ఒప్పందం చేసుకున్నాడు. "జాతీయ ఐక్య ప్రభుత్వ" ఏర్పాటుకు అంగీకరించాడు. ఐరాస శాంతి దళాలు వచ్చాయి. అయినా శాంతి ఏర్పడలేదు. ఆయుధాలు అప్పగించమన్న గబాగో డిమాండుకు ప్రతిపక్షం అంగీకరించలేదు. 2004 నవంబరులో తిరుగుబాటు దారులపై దాడికి గబాగో విమానాలు పంపాడు. బావోకే పట్టణంపై దాడిలో 9 మంది ఫ్రెంచి సైనికులు చనిపోయారు. ఇది పొరపాటున జరిగిందని గబాగో ప్రకటించగా, కావాలనే దాడి చేసాడని ఆరోపించిన ఫ్రాన్సు, ఐవరీ కోస్టు సైనిక విమానాలన్నింటినీ (రెండు సుఖోయి-25 యుద్ధ విమానాలు, 5 హెలికాప్టర్లు) ధ్వంసం చేసింది. దీనితో అబిడ్‌జాన్ నగరంలో ప్రజలు ఫ్రాన్సు చర్యను నిరసిస్తూ ఆందోళన చేశారు. ఫ్రెంచి సైనిక హెలికాప్టర్లు ఆందోళన చేస్తున్న ప్రజలపై టియర్‌గ్యాసు, గ్రెనేడ్లు ప్రయోగించింది. నదులలో గన్‌బోట్లతోనూ, నదులపై బ్రిడ్జిలపై సైనికుల నుంచి పహారా కాసింది.

2005లో అధ్యక్ష ఎన్నికలు జరగాల్సివుంది. ప్రతిపక్షానికీ, ప్రభుత్వానికీ ఒప్పందం కుదరక పోవటంతో ఒక ఏడాది పాటు ఎన్నికలను వాయిదా వేయాలని ఐరాస చెప్పింది. అయినా శాంతి ఏర్పడక పోవటంతో ఎన్నికలను మరో ఏడాది వాయిదావేస్తూ ఐరాస తీర్మానించింది. ఈ తీర్మానంలో కొన్ని భాగాలు తమ రాజ్యాంగ చట్టానికి విరుద్ధంగా ఉన్నాయని గబాగో అమలు జరపనిరాకరించాడు. 2007 మార్చిలో శాంతి ఒప్పందం కుదిరింది. దీని ప్రకారం ప్రతిపక్ష నాయకుడు సోరో ప్రధాని అయ్యాడు. అయినా ఫ్రాన్సు సంతృప్తి చెందలేదు. ఈ పరిణామాలు గబాగోకే బలం చేకూర్చాయని వాదించింది.

ఈ నేపథ్యంలో 2010లో అధ్యక్ష ఎన్నికలు జరిగాయి. 54 శాతం ఓట్లతో ఔత్తారా గెలిచాడని ఎన్నికల కమీషన్ ప్రకటించింది. గబాగో దీనికి అంగీకరించలేదు. ఉత్తర భాగంలో ఔత్తారా అనుకూల శక్తులు ఎన్నికల్లో అక్రమాలకు పాల్పడ్డాయని ఎన్నికల కమీషను తీర్పుపై ఎన్నికల సమితికి అప్పీలు చేశాడు. విచారించిన ఎన్నికల సమితి అక్రమాలు జరిగాయని అంగీకరించి, కొన్ని బూతులలో పోలింగును రద్దు చేసి, 51 శాతం ఓట్లతో గబాగో గెలుపొందాడని తీర్పు చెప్పింది.

(తరువాయి 6వ పేజీలో)

| | | |
|---|---|---|
| వైశాల్యం | : | 3,22,460 చ.కి.మీ. |
| జనాభా | : | 2,06,17,068 |
| రాజధాని | : | యమోసొక్రో |
| ముఖ్యనగరం | : | అబిద్‌జాన్ |
| భాష | : | ఫ్రెంచి, ఆదివాసి |
| మతం | : | ఇస్లాం, క్రిస్టియన్, స్థానిక విశ్వాసాలు |
| స్థూల జాతీయాదాయం | : | 23 లక్షల కోట్ల డాలర్లు |
| తలసరి ఆదాయం | : | 1,680 డాలర్లు |
| ఎగుమతులు | : | కోకో, కాఫీ, కలప, చమురు, ప్రత్తి, అరటి, అనాస, పామాయిలు, చేపలు |

# వ్యూహాత్మక తీర ప్రాంతంలో తిష్టవేయటం ద్వారా మన దేశ భద్రతకు ముప్పుగా మారనున్న సామ్రాజ్యవాద కంపెనీల అణువిద్యుత్ కేంద్రాలు

**ప్రపంచ** వ్యాపితంగానూ, భారతదేశంలోనూ అణువిద్యుత్ కేంద్రాల నిర్మాణం, నిర్వహణ, దుష్ఫలితాలు, వాటి ప్రమాదాలపై తీవ్రమైన చర్చ కొనసాగుతున్నది. ప్రస్తుతం 30 దేశాల్లోని 443 అణురియాక్టర్ల విద్యుదుత్పత్తి సాగిస్తుండగా ఫుకిషిమాలోని అణు విద్యుత్తు కేంద్రాలలోని పరిణామాల అనంతరం వివిధ దేశాలలో ప్రజల ఆందోళనల ఫలితంగా ఈ కేంద్రాలలో కొన్నింటి మూసివేతలు, మరికొన్నింటి పాక్షిక మూసివేతలు, మొత్తంగా సమగ్ర సమీక్షలకు సిద్ధమౌతున్నాయి.

దేశ భద్రతను సైతం నడివీధిలో వేలం వేయటానికి సిద్ధపడిన పాలకులు మాత్రం మన దేశంలో అణువ్యవస్థ దుర్భేద్యమైనదని ఢంకా బజాయిస్తున్నారు. ఇందుకు పూర్వరంగంగా అమెరికాతో సహకార అణు ఒప్పందం; అణు ప్రమాద నష్టపరిహార చట్టాలను నిండు పార్లమెంటులో నిస్సంకోచంగా ఆమోదించుకోవటంలో వివిధ పాలక వర్గ పార్టీలన్నీ 'చేయి' కలిపాయి. తదనుగుణంగా వాటి నిర్మాణాలకు పాలకులు వేగిరపడుతున్నారు.

అమాయకంగానో, అజ్ఞానంగానో లేదా స్వార్ధ ప్రయోజనాలు వుంటేనో తప్ప దేశ భద్రతకు, ప్రజల జీవనానికి తీవ్ర ప్రమాదకరమైన అణువిద్యుత్ కేంద్రాలను ఎవరూ ఆమోదించలేరు. 'భారత సముద్రతీరంలో అణువిద్యుత్ పార్కుల ఏర్పాటు అంశం – ప్రజల భద్రత దృష్ట్యా పూర్తి అవాస్తవిక ప్రతిపాదన' అని ఆటమిక్ రెగ్యులేటరీ బోర్డు మాజీ అధ్యక్షుడు డా॥ గోపాల కృష్ణన్ పేర్కొంటున్నారు.

## జైత్‌పూర్ అణువిద్యుత్ కేంద్ర వ్యతిరేక ఆందోళన

మహారాష్ట్ర–కొంకణ తీరంలో జైత్‌పూర్ అణు విద్యుత్ కేంద్ర నిర్మాణానికి వ్యతిరేకంగా దీర్ఘకాలంగా ప్రజలు సాగిస్తున్న ఆందోళనపై ఆ రాష్ట్ర ప్రభుత్వ పోలీసులు ఏప్రిల్ 18న కాల్పులు జరిపి ఒక నిండు ప్రాణాన్ని బలిగొన్నారు.

జైత్‌పూర్‌లో నిర్మించనున్న 'న్యూక్లియర్ పార్క్'లో ఒక్కొక్కటి 1650 మెగావాట్ల సామర్ధ్యంకల ఆరు అణురియాక్టర్లను ఫ్రెంచ్ కంపెనీ 'అరెవా' నిర్మించనుంది. దేశంలో జీవవైవిధ్యానికి ప్రసిద్ధిగాంచిన సహ్యాద్రి కొండలలో అరేబియా సముద్రతీరాన 'న్యూక్లియర్ పవర్ కార్పోరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్' (ఎన్‌పిసిఐఎల్) ఆధ్వర్యంలో ఈ అణువిద్యుత్ కేంద్ర ప్రతిపాదన ప్రారంభం నుండీ సంబంధిత గ్రామాల ప్రజలు, రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 9900 మెగావాట్ల సామర్ధ్యంతో ప్రపంచంలోనే అతిపెద్దదయిన ఈ అణువిద్యుత్ 'పార్కు' ఫలితంగా ఆ ప్రాంత ప్రజలు–పర్యావరణం–సముద్ర జీవరాశులపై తీవ్ర దుష్పరిణామాలు చోటు చేసుకోనున్నాయి. పశ్చిమ కనుమల పర్యావరణ నిపుణుల బృందం అధ్యక్షులు మాధవ్‌గాడ్గిల్ ఈ ప్రాంతాన్ని పరిశీలన చేసి ఇటీవల రూపొందించిన నివేదికలో 'ఈ ప్రాంత అవసరాలకోసం కావలసిన విద్యుత్ సామర్ధ్యం 180 మెగావాట్లుకాగా, ఇప్పటికే విద్యుదుత్పత్తి 4,543 మెగావాట్లుగా వుంద'ని పేర్కొన్నారు. తమ ప్రయోజనాలతో ఏ మాత్రం సంబంధం లేకుండానే వందల గ్రామాల ప్రజలను విస్థాపనకు గురిచేయడమే కాకుండా ఈ ప్రాంతంలో ప్రధానమైన వ్యవసాయం, పండ్లతోటల పెంపకం, చేపలవేటలను ఈ మెగా అణువిద్యుత్ కేంద్రం సర్వనాశనం చేయనుంది. దేశంలో ఎత్తైన నీటి నిల్వలు (వాటర్ టవర్స్) ఈ సహ్యాద్రి కొండలలోనే వున్నాయి. కృష్ణ, గోదావరి నదులకు మూలాలు ఇక్కడి నుండే వున్నాయి. 'బొటానికల్ సర్వే ఆఫ్ ఇండియా' అధ్యయనం ప్రకారం జైత్‌పూర్ పరిసర పీఠభూములు జీవవైవిధ్యానికి పేరు గాంచినవి.

జైత్‌పూర్ అణువిద్యుత్ కేంద్ర నిర్మాణానికి సంబంధించిన అంచనాలు, పర్యావరణ నివేదికలు వెలువడటానికి నాలుగు సంవత్సరాల ముందుగానే–అంటే ఫ్రాన్సు కంపెనీ 'అరెవా'తో ఒప్పందానికి చాలా ముందుగా, 2006 నుండీ ఈ ప్రాంతంలో భూముల సేకరణకు మహారాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నాలు మొదలుపెట్టింది. జైత్‌పూర్ పరిసర ప్రాంతాలలో 938 హెక్టార్ల భూములను ప్రభుత్వం బలవంతంగా రైతుల నుండి గుంజుకొంది. భూములు కోల్పోయిన వారికి బలవంతాన కట్టబెట్టే ప్రభుత్వ నష్టపరిహార ప్యాకేజీలను కూడా ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. భూములు కోల్పోయిన మొత్తం రైతులలో ఐదు శాతానికంటే కూడా తక్కువమందే నష్టపరిహారాన్ని ఆమోదించి భూముల అప్పగింతకు సిద్ధమయ్యారు. ఈ ఐదు శాతం రైతులలోనూ అత్యధికులు ఆ ప్రాంతంలో భూములుండి బయట ప్రాంతాల్లో నివసించే భూ యజమానులే! జైత్‌పూర్ పరిసర గ్రామమైన 'నాటే' లో మత్స్యకారులు నష్టపరిహారం అంటేనే మండిపడుతున్నారు. 'మాకు ప్రభుత్వం మరో అరేబియా సముద్రాన్ని అందివ్వగలుగుతుందా?' అని అధికారులను నిలదీస్తున్నారు. ఈ ప్రాంతంలో పడవల ద్వారా చేపలవేట సాగించేవారు రోజుకు సగటున 300–400 రూ॥ సంపాదించుకోగలుగుతున్నారు.

జైత్‌పూర్‌కు సమీపంలోని 'లోటే పర్షురామ్' దేశంలోనే అతిపెద్ద పురుగుమందుల ఉత్పత్తి కేంద్రంగా వుంది. అత్యంత ప్రమాదకర పరిస్థితుల్లో ఇక్కడి కార్మికులు పనిచేస్తున్నారు. దీని చుట్టుప్రక్కల జలాశయాలన్నీ విషవ్యర్ధాలతో కలుషితమైపోయాయి. ఈ పరిస్థితిని జైత్‌పూర్ ప్రజలు దగ్గరగా గమనిస్తున్నారు. ఇంతేగాక, జైత్‌పూర్ ప్రక్కనున్న సింధుదుర్గ్‌లోనూ రసాయన పరిశ్రమలు, పెద్ద ఎత్తున గనుల తవ్వకాలు సాగుతున్నాయి. వీటి దుష్ఫలితాలూ ఈ ప్రజల దృష్టిలో వున్నాయి.

2010 మేలో ప్రజాభిప్రాయ సేకరణ తంతును ప్రభుత్వం పెద్ద ఎత్తున పోలీసుల మోహరింపు నడుమ సాగించింది. ప్రజాభిప్రాయ సేకరణకు కనీసం నెలరోజుల ముందుగా పర్యావరణ ప్రభావ అంచనా నివేదికలను సంబంధిత పంచాయితీల ద్వారా వారి మాతృభాషలో ప్రజలందరికీ అందుబాటులో వుంచాల్సివుంది. కాగా ప్రజాభిప్రాయ సేకరణకు 4 రోజుల ముందు, అది కూడా ఒకే ఒక్క గ్రామానికి మాత్రమే ఆ నివేదికను అందించట మంటే ప్రభుత్వ–ప్రజాభిప్రాయ సేకరణలోని బూటకత్వం వెల్లడౌతున్నది. వాస్తవానికి ఈ ప్రజాభిప్రాయ సేకరణ తంతుకు ముందుగానే అణు విద్యుత్తు కేంద్ర ప్రభావిత గ్రామాల పంచాయితీలన్నీ సమావేశాలు నిర్వహించుకొని జైత్‌పూర్ అణువిద్యుత్ కేంద్రాన్ని వ్యతిరేకిస్తూ ఏకగ్రీవంగా తీర్మానాలు చేసి ఉన్నతాధికారులకు అందించినా వాటిని పరిగణనలోకి తీసుకోకుండా ప్రక్కన పడేశారు.

2010 నవంబర్ 26న ఫ్రెంచ్ ప్రెసిడెంట్ సార్కోజీ భారత దేశపర్యటనకు సరిగ్గా పదిరోజుల ముందుగా జైత్‌పూర్ అణువిద్యుత్ కర్మాగారానికి ప్రభుత్వ అనుమతి లభించటం యాదృచ్ఛికంకాదు. ఈ విధంగా అనుమతి నీయటం వెనుక 'ఆర్ధిక,వ్యూహాత్మక' ప్రయోజనాలున్నాయని పర్యావరణశాఖామంత్రి జైరామ్ రమేష్ వ్యాఖ్యానించటంలో ఆంతర్యమేమైనప్పటికీ దేశాన్ని విచ్చలవిడిగా దోచుకుపోయేందుకు, వ్యూహాత్మక దేశ తీరప్రాంతంపై తమ పట్టును బలీయం చేసుకునేందుకూ తద్వారా సామ్రాజ్యవాదుల 'ఆర్ధిక, వ్యూహాత్మక' ప్రయోజనాలు నెరవేర్చేందుకే దళారీ పాలకులు నిస్సిగ్గుగా వ్యవహరిస్తున్నారనేది తేటతెల్లమౌతున్నది.

జైత్‌పూర్ అణుకేంద్రం నుండి రియాక్టర్లను చల్లబరచిన అనంతరం తిరిగి సముద్రంలోకి చేరే నీరు, సముద్ర జలాల వేడిమికంటే 5 డిగ్రీల సెంటీగ్రేడ్ అధికంగా వుండటమనేది సముద్ర జీవరాశుల ఉనికికి ఏమాత్రం ప్రమాదం కాదంటూ ఇ.ఐ.ఏ. సంస్థ తనరిపోర్టులో అడ్డగోలుగా పేర్కొంది. కాగా 'బాంబే నాచురల్ హిస్టరీ సొసైటీ'–ఇ.ఐ.ఏ. వాదనలను సాధికారంగా, శాస్త్రీయంగా తప్పని నిరూపించటమేగాక, సముద్ర జలాల సాధారణ ఉష్ణోగ్రతను మించిన 0.5 డిగ్రీల అదనపు వేడిమికూడా సముద్ర జీవరాశుల ఉనికికి, అభివృద్ధికి ఏ విధంగా ఆటంకమో వివరించింది.



జైత్‌పూర్ ప్రజల ఆందోళనపై పోలీసు నిర్బంధం

## ఉద్యమంపై పోలీసు నిర్బంధం

గత నాలుగు సంవత్సరాలలో అణువిద్యుత్ కేంద్ర వ్యతిరేక ఉద్యమకారులను, ప్రజలను అనేకమందిని అరెస్ట్ చేయటం, నిర్బంధాలు ప్రయోగించటమనేది సాగుతూవస్తున్నది. 2010 డిసెంబరు 4న ఒకే విడతలో 3వేల మందిని పోలీసులు అరెస్టు చేశారు. బాంబే హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి.జి. ఖోస్లే పాటిల్‌ను ఐదురోజుల పాటు అక్రమంగా నిర్బంధించారు. అరెస్ట్ చేసిన 24 గంటలలోపు ముద్దాయిలను న్యాయమూర్తి ముందు హాజరుపరచాలనే నిబంధనను హైకోర్టు మాజీ న్యాయమూర్తి విషయంలోనే మంటగలిపారు. జులై 2007 నుండి అక్టోబరు 2009 కాలంలో మహారాష్ట్ర పోలీసులు మొత్తంగా 191 రోజుల పాటు అకారణంగా తీవ్ర నిషేదాజ్ఞలు విధించి, పౌరుల హక్కులను హరించివేస్తూ వచ్చారనే విషయాన్ని నమోదు చేయటమే మాజీ హైకోర్టు న్యాయమూర్తిగారు చేసిన నేరం! అరెస్టు చేసిన అనేక మందిపై పోలీసులు హత్యాప్రయత్న నేరాన్ని (సెక్షన్ 307) బనాయించారు. తద్వారా బెయిల్ రాకుండా చేసి అత్యధిక కాలం జైళ్ళలో నిర్బంధించారు.

సుప్రీంకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి మరియు ప్రెస్‌కౌన్సిల్ ఆఫ్ ఇండియా మాజీ అధ్యక్షుడు పి.వి. సావంత్‌ను; ముంబయి హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఖోస్లే పాటిల్‌ను; భారత మాజీ నౌకా దళ ప్రధానాధికారి అడ్మిరల్ రాందాస్‌వంటి ప్రముఖులను సైతం రత్నగిరి జిల్లాలోకి అడుగుపెట్టనీయకుండా పోలీసులు నిషేదాజ్ఞలు విధించి అడ్డుకున్నారు.

2011 మార్చి 6,7 తేదీలలో జైత్‌పూర్ అణువిద్యుత్ కేంద్ర ప్రతిపాదిత స్థలంలో ఒక బహిరంగ ప్రజాన్యాయస్థానాన్ని నిర్వహించేందుకు 'ఆందోళనకారుల పోరాట సమితి' తలపెట్టింది. శాస్త్రవేత్తలు, ఆర్ధికవేత్తలు, పర్యావరణవాదులు, సాంకేతిక నిపుణులతో పాటుగా దేశంలోని వివిధ ప్రాంతాలలో అణువిద్యుత్ కేంద్రాలకు వ్యతిరేకంగా ఆందోళన సాగిస్తున్న ఉద్యమ ప్రతినిధులను కూడాఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు ఆహ్వానించారు. అయితే రాష్ట్ర హైకోర్టు ఈ ప్రజా న్యాయస్థానాన్ని నిర్వహించనీయకుండా ఆదేశాలు జారీ చేసి నిలిపివేసింది.

కాగా, జైత్‌పూర్ పరిసర గ్రామమైన 'పవాస్'లో అణువిద్యుత్ కేంద్ర పరిధిలోని గ్రామాల ప్రజా ప్రతినిధులతో, ఈ ఉద్యమంలో పాల్గొంటున్న వివిధ ప్రజాసంఘాల నాయకులతో రాష్ట్ర హైకోర్టు తానే ఒక బహిరంగ సమావేశం నిర్వహించటానికి ముందు కొచ్చింది. కానీ ఈ సమావేశ స్థలంవద్దకు ప్రజలను చేరుకోనీయకుండా రోడ్లను దిగ్బంధించి, పెద్ద ఎత్తున పోలీసులను మోహరింపజేసింది. ఈ సమావేశంలో పాల్గొనేందుకు సుదూర ప్రాంతం నుండి వచ్చిన సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి పి.వి. సావంత్ వంటి వారిని కూడా దీనిలో పాల్గొననీయకుండా పోలీసులు తిప్పిపంపారు. ఏమైనా, పరిసర గ్రామాల ఆందోళనాకారులు ఈ సమావేశంలో పాల్గొని తమ తీవ్ర నిరసననూ అసమ్మతినీ వ్యక్తం చేశారు. ఆందోళనను కొనసాగిస్తామని ప్రకటించారు.

జైత్‌పూర్ పరిసర గ్రామాల ప్రజలలో అత్యధికులు ఏదో మేరకు అక్షరాస్యులుగా ఉండటమే గాక, అణవిద్యుత్ కేంద్రాల వలన సంభవించే ప్రమాదాలు, పర్యవసానాలపట్ల స్పష్టతతో వున్నారు. అణుధార్మికత క్యాన్సర్ కారకమనీ, పిల్లల పుట్టుకపై దుష్ప్రభావాన్ని కలిగిస్తుందనీ, ఏదో విపత్తు సంభవించినపుడే గాక, ప్రతి రోజూ ఈ కేంద్రాల నుండి వెలువడే అణు వ్యర్ధాలు, ధూళిలో కలగలిసే అణు ధార్మికత ప్రమాద కారకమనీ, ఈ ప్రాంత వాసులు సాధికారికంగా పేర్కొంటున్నారు. కాగా ఇప్పుడు ఫ్రాన్సు సరఫరా చేసే తేలిక జల రియాక్టర్లు కొత్తగా తయారు చేసినవి. ఇంతవరకూ ఎక్కడా వాడలేదు. మొదటిసారిగా భారత్‌లోనే వీటిని స్థాపిస్తున్నారు. వీటి పనితీరు ఎలా ఉంటుంది? ప్రమాదాలు జరగకుండా హామీ ఏమిటన్నది వీటిని తయారు చేస్తున్న కంపెనీ చెపుతున్న మాటలే తప్ప ఎలాంటి ఆచరణ యుక్త హామీలేదు. ఈ నేపథ్యంలో జపాన్‌లోని ఫుకుషిమా అణువిద్యుత్ కేంద్రంలో సంభవించిన పరిణామాలతో దేశంలోని అణువిద్యుత్ కేంద్రాల ప్రతిపాదిత ప్రాంతాలన్నింటా ప్రజలు అప్రమత్తులయ్యారు. తమ ఆందోళనలను తీవ్రం చేశారు.

## ఆందోళనకారులపై పోలీసు కాల్పులు

జైత్‌పూర్ అణువిద్యుత్ కేంద్ర నిర్మాణ విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ వెనక్కు తగ్గేది లేదని మొండిపట్టుతో వున్న ప్రభుత్వం, ఆందోళనకారులపై పోలీసులను ప్రయోగించింది.

ఏప్రిల్ 18వ తేదీన జైత్‌పూర్ పరిసర గ్రామమైన 'నాటే'లో పోలీసులు జరిపిన కాల్పులలో సాయేకర్ అనే మత్స్యకారుడు మరణించాడు. ఆ సందర్భంగా జరిగిన సంఘర్షణలో అనేక మంది ఆందోళనకారులు తీవ్రంగా గాయపడ్డారు. చెల్లా చెదురవుతున్న ప్రజలపై కక్షబూనిన విధంగా పోలీసులు లాఠీలతో విరుచుకుపడ్డారు. ఇళ్ళపై దాడులు చేసి లోపలున్న వారిని కూడా బయటకులాగి తీవ్రంగా కొట్టారు. మహిళలను వీధులలోకి ఈడ్చి అవమానించారు.

పోలీసు కాల్పులలో మృతి చెందిన సాయేకర్ కుటుంబసభ్యులు మృతదేహానికి పోస్టుమార్టమ్ నిర్వహించేందుకు తొలుత అంగీకరించలేదు. మొదటి బులెట్ దెబ్బకు సాయేకర్ చనిపోలేదని వారు ప్రకటించారు. బుల్లెట్ దెబ్బతో గాయపడిన సాయేకర్‌ను ఒక బస్తాలో కుక్కి పోలీసు జీపులో వేశారనీ, జీపులోనే పోలీసులు మరోసారి కాల్చి చంపారనీ, గాయపడిన సాయేకర్‌తో జీపులో వెంటవెళ్ళేందుకు అతని భార్య లేదా బంధువుల నెవరినీ పోలీసులు అనుమతించలేదనీ వారు తమ ఆవేదనను వ్యక్తం చేశారు.

సాయేకర్‌ను బలిగొన్న పోలీసు అధికారిని శిక్షించాలని వారు హాస్పిటల్ ఎదుటే బైఠాయించారు. ప్రతిపక్ష శివసేన, ఇతర పాలక పార్టీలు, ప్రజా సంఘాలన్నీ వీరికి మద్దతుగా వచ్చాయి. ఆందోళనా కారులు మరునాడు బంద్‌కు పిలుపునిచ్చారు. సాయేకర్ మృతదేహానికి ఐదుగురు డాక్టర్ల బృందం పోస్టుమార్టం నిర్వహించాలని, ఆ మొత్తం క్రమాన్ని వీడియో చిత్రీకరణ చేయాలనే షరతును పోలీసు, ఆసుపత్రి అధికారులు అంగీకరించటంతో పోస్టుమార్టమ్ నిర్వహించేందుకు అంగీకరించారు.

ఈ ఉద్రిక్త పరిస్థితుల నడుమ పోలీసులు జిల్లా కేంద్రమైన రత్నగిరిలో కర్ఫ్యూవిధించి ఆసుపత్రి బయటనున్న 200 మంది మృతుని బంధువులు, ప్రజాసంఘాలు, ఆందోళన కారులపై లాఠీఛార్జి చేశారు. రత్నగిరి జిల్లా 'నాటే' గ్రామ పొలిమేరల్లోనే వున్న పోలీస్ స్టేషన్‌ను ఆందోళనకారులు తగులబెట్టారనే అవాస్తవ ప్రచారాన్ని పోలీసులు పెద్దఎత్తున సాగించారు. పోస్టుమార్టమ్ రిపోర్టులో మూడు బుల్లెట్ గాయాలు (గుండె, ఊపిరితిత్తులు, కాలేయం, మూత్రపిండాలను) తీవ్రంగా గాయపరచటం ద్వారా సాయేకర్ మరణించాడని వెల్లడైంది. ఈ నిర్బంధాలను అధిగమించి అణువిద్యుత్ కేంద్ర నిర్ణయాన్ని రద్దు చేసేంతవరకు తమ ఆందోళనను కొనసాగిస్తామని ఆందోళనాకారులు ప్రకటించారు.

## తారాపూర్ నుండి జైత్‌పూర్ వరకూ

భారతదేశంలో 1969లో మహారాష్ట్రలో మొట్టమొదటగా నిర్మించిన అణువిద్యుత్ కేంద్రం 'తారాపూర్'! ఇది జైత్‌పూర్‌కు 650 కిలో మీటర్ల దూరంలో వుంది. తారాపూర్ అణువిద్యుత్ కేంద్రం కారణంగా విస్థాపనకు గురైన ప్రజలకు 1960ల నుండీ ఈనాటి వరకూ ప్రభుత్వం తగిన నష్టపరిహారాన్ని చెల్లించలేదు. అంతేగాక గడిచిన ఈ నాలుగు దశాబ్దాల కాలంలో పరిసర ప్రాంతల ప్రజలు అణుధార్మికతకు గురైన ఫలితంగా దాదాపుగా ప్రతి ఇంటిలోనూ ఒక క్యాన్సర్



జైత్‌పూర్ ప్రజల ఆందోళనపై పోలీసు నిర్బంధం

పీడితుడో, పునరుత్పత్తి సామర్థ్యాన్ని కోల్పోయిన స్త్రీనో, పురుషుడో వుండటమనేది సర్వసాధారణ విషయంగా మారటమంటే అణుధార్మిక దుష్ప్రభావాల తీవ్రత అర్థమౌతుంది. అణుకేంద్ర స్థాపనకు పూర్వం ఈ ప్రాంతం మత్స్య సంపదలతో అలరారేది. ఈ అణుకేంద్ర స్థాపన తదనంతరం రియాక్టర్ల నుండి వెలువడే కాలుష్య పూరిత వేడినీరు సముద్రంలో కలుస్తున్న కారణంగా మత్స్య సంపద నాశనమైంది. చేపలవేట సాగించే మూడు ఓడరేవులు మూతబడటంతో వందలాది మత్స్యకారుల కుటుంబాలు ఘోరంగా దెబ్బతిన్నాయి. ఒకనాడు రైతులుగా, మత్స్యకారులుగా గౌరవ ప్రదమైన జీవనాన్ని గడిపినవారు, ఈనాడు తారాపూర్ పరిసర ప్రాంతాల్లో రోజువారీ కూలీలుగా మిగిలిపోయారు. పైగా వీరికి కేటాయించే పనులు కూడా, అణువిద్యుత్ కర్మాగారాల నుండి అణుధార్మికతతో కూడిన విష జలాలను తొలగించటం వంటి ప్రాణాంతకమైనవి!

జైత్‌పూర్ అణువిద్యుత్ కేంద్ర వ్యతిరేక ఆందోళనపై పోలీసు కాల్పులు–ఒక మత్స్యకారుని మృతి అనంతరం–తారాపూర్ నుండి జైత్‌పూర్ వరకు 2011 ఏప్రిల్ 23,24,25 తేదీల్లో ప్రజాయాత్ర చేపట్టటం ద్వారా అణువిద్యుత్ కేంద్ర ప్రమాద తీవ్రతను ఎలుగెత్తి చాటాలని 'పోరాట సమితి' నిర్ణయించింది. అయితే ప్రభుత్వం ఈ యాత్రను అడుగడుగునా అడ్డుకునేందుకు ప్రయత్నించింది. తారాపూర్ నుండి జైత్‌పూర్ వరకు యాత్ర సాగిన పొడుగూతా నిర్బంధాన్ని ప్రయోగించి, నిషేధాజ్ఞలను విధించి అరెస్టులను సాగించటం ద్వారా అడ్డుకోజూసింది. ప్రచార యాత్ర చివరిరోజైన 25వ తేదీన కూడా 13 మంది కార్యకర్తలను పోలీసులు అరెస్టు చేశారు. తారాపూర్ నుండి జైత్‌పూర్ వరకు తలపెట్టిన ఈ యాత్ర వారి ఆందోళనకు విస్తృత ప్రజా మద్దతును కూడగట్టేందుకు తోడ్పడింది.

## గోరఖ్‌పూర్ అణువిద్యుత్ కేంద్రానికి వ్యతిరేకత

హర్యానా రాష్ట్రం – ఫతేబాద్ జిల్లాలోని గోరఖ్‌పూర్‌లో నిర్మించతలపెట్టిన అణువిద్యుత్ కేంద్రాన్ని నిరసిస్తూ 2011 మార్చి 19న 'కిసాన్ సంఘర్ష్ సమితి' ఆధ్వర్యంలో వందలాది మంది రైతులు కొవ్వొత్తులతో ఒక నిరసన ప్రదర్శన నిర్వహించారు. వీరంతా, ఇటీవల జపాన్ దేశం, ఫుకిషిమాలోని అణువిద్యుత్ కేంద్రాల ధ్వంసం కారణంగా మరణించిన వారికి సంతాప సూచకంగా రెండు నిమిషాలు మౌనం పాటించారు.

ఫతేబాద్ ప్రాంతంలో గత సంవత్సరం ఆగస్టు నుండీ అణువిద్యుత్ కేంద్ర స్థాపన పేరిట సారవంతమైన భూములను గుంజుకునే కార్యక్రమం ప్రారంభమైంది. దీనిని నిరసిస్తూ గత 200 రోజులుపైగా ఫతేబాద్‌లోని డిప్యూటీ కమీషనర్ కార్యాలయం ఎదుట 200 మంది రైతులు నిర్బంధ భూ సేకరణను నిరసిస్తూ నిరవధిక ధర్నాను నిర్వహిస్తూ వస్తున్నారు. తీవ్రమైన చలిగాలులను సైతం లెక్కచేయకుండా వీరు సాగించిన ఈ ఆందోళన క్రమంలో ఇద్దరు రైతులు అనారోగ్యానికి గురై మరణించారు కూడా! అయినా వీరి ఆందోళన ఆగకుండా సాగుతున్నది.

గోరఖ్‌పూర్‌లో నిర్మించతలపెట్టిన అణువిద్యుత్ కేంద్రం ఫలితంగా వాటిల్లబోయే నష్టం గురించి ఆ గ్రామ ప్రజలేకాక పరిసర గ్రామాల ప్రజలూ క్రమంగా గ్రహిస్తున్నారు. గోరఖ్‌పూర్ అణువిద్యుత్ కేంద్రంలో భవిష్యత్‌లో ఏదేని ప్రమాదం సంభవిస్తే ఢిల్లీ, చండీఘడ్, అంబాలా, పానిపట్, సిర్సా, హిస్సార్, మహేంద్రఘడ్‌లకు కూడా తీవ్ర ప్రమాదం వాటిల్లుతుంది.

ఈ కారణంగా ఆయా పట్టణాల్లో ప్రజలను చైతన్యపరిచేందుకు ఆందోళనకారులు ప్రచారం, సెమినార్లు నిర్వహిస్తున్నారు. శాస్త్రవేత్తలు, విద్యావంతులతో సమావేశాలు నిర్వహిస్తున్నారు. అణు విద్యుత్ కేంద్ర ప్రమాదాలు, అణుధార్మిక దుష్పరిణామాలను రైతులకు, విద్యార్థులకు వివరిస్తున్నారు. డాక్యుమెంటరీ చిత్రాల ద్వారా గ్రామాల్లో ప్రజలకు అణుప్రమాదాల తీవ్రతను అర్థం చేయించే ప్రయత్నం చేస్తున్నారు.

## కొవ్వాడ అణువిద్యుత్ కేంద్ర నిర్మాణానికి వ్యతిరేకత

మన రాష్ట్రంలోని శ్రీకాకుళం జిల్లా రణస్థలం మండలం కొవ్వాడ–మత్స్యలేశం వద్ద దాదాపు రెండు దశాబ్దాల క్రితమే అణువిద్యుత్ కేంద్ర నిర్మాణానికి ప్రభుత్వం పూనుకోవటం, దీనికి పెద్ద ఎత్తున ప్రజలు, మేధావుల నుండి వ్యక్తమైన వ్యతిరేకతతో అప్పటికి వెనక్కు తగ్గటం జరిగింది. ఐతే, తిరిగి ఇదే ప్రాంతంలో ఎన్.పి.సి.ఐ.ఎల్ ఆధ్వర్యంలో అణువిద్యుత్ కేంద్రానికి భూముల సేకరణ పూర్తిచేసుకొని నిర్మాణానికి ప్రభుత్వం సిద్ధమౌతున్నది. ఈ అణువిద్యుత్ కేంద్రానికి వ్యతిరేకంగా 30 పంచాయితీల పరిధిలోని 150 గ్రామాల ప్రజలు 'అణువిద్యుత్ వ్యతిరేక పోరాట సమితి'గా ఏర్పడి ఆందోళన కొనసాగిస్తున్నారు. ఫుకిషిమా అణు కర్మాగారంలోని సంక్షోభ నేపథ్యంలో ఈ ప్రాంత వాసులంతా మరింత అప్రమత్తులై అణువిద్యుత్ కేంద్ర నిర్మాణాన్ని అడ్డుకునేందుకు సిద్ధంగావున్నారు.

## పాలకపార్టీల వైఖరి

మన దేశంలోనూ, వివిధ రాష్ట్రాలలోనూ అధికారంలోనూ లేదా విపక్షంలోనూ కొనసాగుతున్న జాతీయస్థాయి లేదా ప్రాంతీయ స్థాయి పార్టీలన్నీ అధికారంలో వున్నపుడు ఒక విధంగానూ విపక్షంలో వున్నపుడు మరో విధంగానూ వ్యవహరిస్తున్నాయి.

ఆంధ్రప్రదేశ్‌లో తాను అధికారంలోనున్న కాలంలో అభివృద్ధి పేరిట చేపట్టిన ప్రాజెక్టులు, పరిశ్రమలనూ, విద్యుత్ కేంద్రాలనూ ఈనాడు విపక్షంలోనున్న తెలుగుదేశంపార్టీ వ్యతిరేకిస్తున్నట్లుగా ఫోజుపెడ్తున్నది. అదే విధంగా కాంగ్రెస్ పార్టీ తాను అధికారంలో నున్న రాష్ట్రాలలో అభివృద్ధి పేరిట అమలు చేస్తున్న విధానాలనే ఇతర పాలక పార్టీలు అధికారంలోనున్న రాష్ట్రాలలో వ్యతిరేకిస్తూ ప్రజల అసంతృప్తిని సొమ్ము చేసుకోదలచు కుంటున్నది. అసలు సిసలైన దేశభక్తికి, జాతీయభావాలకు తామే నిజమైన ప్రతీకలమని ప్రగల్భాలు పలికే బి.జె.పి., శివసేన వంటి పార్టీలు విపక్షంలో ఉండగా వ్యతిరేకించిన 'ఎన్రాన్' వంటి విద్యుత్ ప్రాజెక్టులను అధికారంలోకి వచ్చాక బేషరతుగా అమలు జరిపాయి. జైత్‌పూర్ అణు విద్యుత్ కేంద్ర విషయం లోనూ బి.జె.పి., శివసేన వ్యతిరేకిస్తున్నట్లుగా ఫోజుపెట్టటమే తప్ప విధానపరంగా అణువిద్యుత్ పరిశ్రమలను వ్యతిరేకించటంలేదనేది స్పష్టమే! జైత్‌పూర్ కాల్పుల పరిణామాల నేపథ్యంలో మహారాష్ట్ర అసెంబ్లీలో జరిగిన చర్చ సందర్భంగా విపక్ష బిజెపి నాయకుడు ఏక్‌నాథ్‌ఖడ్సే మాట్లాడుతూ 'తమపార్టీ అణువిద్యుత్ కేంద్ర నిర్మాణాలకు వ్యతిరేకం కాదని, అయితే ఇందులో చోటు చేసుకుంటున్న పాలక ప్రభుత్వ అక్రమ, అవినీతికర, నిర్బంధ విధానాలను మాత్రమే తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామ'ని బాహాటంగా ప్రకటించాడుకూడా!

కావున, అణువిద్యుత్ కేంద్రాల నిర్మాణానికి, థర్మల్ విద్యుత్ కేంద్ర నిర్మాణాలకు వ్యతిరేకంగా వివిధ ప్రాంతాల్లో సాగుతున్న ఆందోళన సందర్భంగా నాయకత్వాన్ని చేజిక్కించుకునేందుకు, సంబంధిత ప్రాజెక్టుల దుష్ఫలితాల పట్ల ప్రజల న్యాయమైన అసమ్మతి, ఆందోళనను సొమ్ము చేసుకునేందుకు ఎల్లవేళలా గుంటకాడనక్కల్లా పొంచి వున్న పాలకవర్గ పార్టీల పట్ల ప్రజలు, ఆందోళనకారులు, ఉద్యమ నాయకత్వం అప్రమత్తంగా ఉండాలి.

## వివిధ వాలంటరీ సంస్థల వైఖరులు

దేశంలోనూ, వివిధ రాష్ట్రాలలోనూ థర్మల్, అణువిద్యుత్ కేంద్రాలకు వ్యతిరేకంగా సాగుతున్న ఆందోళనల్లో వ్యక్తులుగానూ, సంస్థలుగానూ, వివిధ దేశాల ఆర్థిక నిధులతో నడిచే సంస్థలు కూడా పాలు పంచుకోవటం, కొన్ని సందర్భాల్లో ముందుండటాన్ని కూడా గమనించగలం.

ప్రపంచ వ్యాపితంగా సామ్రాజ్యవాదులు మార్కెట్ల కోసం తమలో తాము పోటీ పడ్తున్న విధంగానే విశాలమైన భారత దేశంలోనూ– మీదు మిక్కిలి వ్యూహాత్మక తీర ప్రాంతంలోనూ తిష్టవేసేందుకు వివిధ రూపాల్లో సామ్రాజ్యవాద సంస్థల మధ్య పోటీ నెలకొనివుంది. ఆయా సామ్రాజ్యవాద దేశాల నిధులతో నడిచే సంస్థలు మన దేశంలో కమ్యూనిస్టు విప్లవకారుల నాయకత్వంలోకి ఈ ఉద్యమాలేవీ వెళ్ళకుండా వుండేందుకు తమ కుట్రపూరిత విధానాలను ఏనాటినుండో కొనసాగిస్తూ వస్తున్నారు.

ప్రస్తుత అణు, థర్మల్ విద్యుత్ కేంద్రాల వ్యతిరేక ఆందోళనలను పరిశీలిస్తే కూడా వివిధ వాలంటరీ సంస్థల ప్రయోజనాలు, ఉద్దేశాలు స్పష్టమౌతాయి. అణు, థర్మల్ విద్యుత్ కేంద్రాల ప్రమాదాల తీవ్రతను–ప్రజల విస్థాపన, జీవనాధారం కోల్పోయే సమస్యగానూ; సముద్రం–మత్స్యకారుల జీవన సమస్యగానూ; ప్రకృతి పర్యావరణాలకు సంబంధించిన సమస్యలుగా మాత్రమే పరిమితం చేస్తూ ఆయా సందర్భాలలో కొందరు అవినీతి అధికారుల మీదకు దృష్టిని మళ్ళిస్తూ మొత్తంగా ఈ అణు, థర్మల్ విద్యుత్ కేంద్రాల స్థాపన వెనకున్న సామ్రాజ్యవాదులు, వారికి కొమ్ముగాస్తున్న దళారీ పాలకుల విధానాలపైకి దృష్టి మరలకుండా అడ్డుకుంటున్నారు.

మరికొన్ని ప్రాంతాల్లో థర్మల్ విద్యుత్ కేంద్రానికి వ్యతిరేకంగా తీవ్రంగా మాట్లాడుతూ, ఉద్యమానికి నాయకత్వం వహిస్తున్న శక్తులు సాపేక్షంగా మరింత ప్రమాదకారకమైన, ప్రక్కనే నిర్మాణంకానున్న అణువిద్యుత్ కేంద్రాలకు వ్యతిరేకంగా నోరు మెదపకపోవటం కాకతాళీయంకాదు.

## జాతీయ, దేశభక్తియుత, విప్లవ శక్తుల కర్తవ్యం

ప్రస్తుతం దేశ విద్యుదుత్పాదనా సామర్థ్యంలో అణువిద్యుత్ వాటా 3 శాతం మాత్రమేననీ దీనిని 13 శాతానికి పెంచేందుకు ప్రభుత్వం సంకల్పించిందనీ, అణువిద్యుత్తే 'బెస్ట్ ఆప్షన్'గా భారత ప్రభుత్వం విద్యుత్ విధాన పత్రంలో పేర్కొంది. 2008లో ప్రకటించిన ఈ విధానం ప్రకారం 2050 నాటికి విద్యుదుత్పాదనా శక్తిని 6 లక్షల 55 వేల మెగావాట్లకు పెంచాల్సిన అవసరం వుందన్నారు. దీనికోసం 109 అణు విద్యుత్ పార్కులు అవసరమౌతాయి. భారత సముద్ర తీరం మొత్తంలో సగటున ప్రతి 55 కిలోమీటర్లకూ ఒక అణువిద్యుత్ పార్కు చొప్పున నిర్మాణ మౌతాయి. ఈ విధంగా మన దేశ దళారీ పాలకులు ఎంతటి వినాశనాన్ని కొనితేనున్నారో, దేశ ప్రజలను ఎంతటి విపత్కర పరిస్థితుల నుడిగుండం లోనికి నెట్టనున్నారో, ముఖ్యంగా వ్యూహాత్మకంగా కీలకమైన 7500 కిలో మీటర్ల దేశ తీర ప్రాంతాన్నంతా ఏ విధంగా సామ్రాజ్యవాదులకు పోరతి పళ్ళెంలో పెట్టి సమర్పించనున్నారో విదితమౌతున్నది.

యూరప్‌లోనూ, అమెరికా ఖండంలోనూ అణు రియాక్టర్ల నిర్మాణానికి వ్యతిరేకంగా ప్రజలు చాలా కాలంగా ఆందోళన చేస్తున్నారు. రష్యాలోని చెర్నోబిల్‌లో జరిగిన ప్రమాదంతో ఈ ఆందోళన మరింత ఊపందు కుంది. అణు విద్యుత్తును ఎక్కువగా ఉత్పత్తి చేసే ఫ్రాన్సు ఇక ముందు కొత్తగా అణుకర్మాగారాలు నిర్మించరాదని నిర్ణయించాల్సి వచ్చింది. ప్రజాందోళనకు తలవంచి జర్మనీ ప్రభుత్వం 2014 నాటికి జర్మనీలోని అణు కర్మాగారాలన్నిటినీ మూసివేస్తానని చట్టం చేసింది. వీటిలో కొన్నింటిని 2020 వరకూ పనిచేయించేందుకు ఆ కంపెనీలకు అనుమతి నిచ్చేందుకు పూనుకోవటంతో జర్మనీ ప్రజలు మళ్లీ నిరసన తెలిపారు. భూకంపం, సునామీలతో ఫుకిషిమా అణుకేంద్రం బ్రద్దలవటంతో ఆ ప్రాంతంలోని పంటలనూ, పాలనుకూడా వాడకుండా గొయ్యితీసి పాతిపెడుతున్నారు. అత్యున్నత సాంకేతిక పరిజ్ఞానమున్న జపాను కూడా ప్రమాదాన్ని నివారించలేక పోవటమూ, అణు ధార్మిక విషప్రభావాన్ని ఆపలేక పోవటమూ అణు కర్మాగారాల భద్రతకు ఎలాంటి హామీలేదని తేటతెల్లమైంది.

కాగా, మన దేశంలో నిర్మాణమైన, నిర్మాణం చేయబోయే అణు కర్మాగారాలలో చిన్నపాటి మరమ్మత్తులకు సంబంధించిన సాంకేతిక పరిజ్ఞానం కోసం కూడా సామ్రాజ్యవాద దేశాలపై ఆధారపడే మన దేశ పాలకులు మాత్రం నిర్ద్వంద్వంగా మన దేశంలో అణువిద్యుత్ కేంద్రాలన్నీ భద్రమైనవేనని కుండబ్రద్దలుకొట్టి మరీ చెప్తున్నారు! ఔను...భోపాల్‌లో యూనియన్ కార్బైడ్ సృష్టించిన విలయంలో పదివేల మందికి పైగా ప్రజలు చనిపోయేంత వరకూ అదికూడా అత్యంత భద్రమైనదేనని ఢంకా బజాయించిన ప్రబుద్ధులే వీరంతా!

ఈ నేపథ్యంలో మనదేశ ప్రజల అవసరాల కనుగుణమైన దేశీయ విద్యుత్ విధానాన్ని రూపొందించాలని, విదేశీ సామ్రాజ్యవాదులకు తీరాన్ని అప్పగించే, దేశ ప్రజల జీవితాలలో పెను విషాదాన్ని నింపే అణు విద్యుత్ కేంద్రాల నిర్మాణాన్ని, ఇబ్బడి ముబ్బడిగా నిర్మాణం సాగిస్తున్న థర్మల్ విద్యుత్ కేంద్రాల నిర్మాణాన్ని నిలిపివేయాలని, మన దేశంలో లభ్యమయ్యే ప్రమాద రహితమైన జల, వాయు, సూర్యరశ్మి, గ్యాస్ తదితర వనరులపై ఆధారపడి విద్యుత్ అవసరాలను అందుకోవాలని, విద్యుత్‌ను ప్రజా అవసరాలకు, రైతాంగానికి, దేశీయ పరిశ్రమలకు ప్రాధాన్యతా క్రమంలో అందించాలని డిమాండ్ చేస్తూ జాతీయ, దేశభక్తియుత, విప్లవ శక్తులు ఉద్యమించాల్సిన అవసరముంది. D

# కాలుష్య పూరితంకానున్న 'మహారాష్ట్ర కాశ్మీర్‌గా' పిలువబడే కొంకణతీరం

**7,500** కిలోమీటర్ల నిడివివున్న మనదేశ సముద్రతీరంపై సామ్రాజ్యవాదులు కేంద్రీకరించారు. సహజ వనరులరీత్యా సంపద్వంతమైనదేకాక వ్యూహాత్మకంగా కీలకమైనది కావటంతో సామ్రాజ్య వాదులు వివిధ బహుళజాతి పరిశ్రమల పేరుతో తీరంలో దిగిపోతున్నారు.

1960ల నుండీ దేశాన్ని ఆవరించివున్న కోస్తా తీరప్రాంతం కాలుష్యం బారిన పడకుండా, తీరప్రాంత ప్రజాప్రయోజనాలను కాపాడేందుకు ఉద్దేశించిన కోస్టల్ రెగ్యులేటరీ జోన్ (సిఆర్‌జడ్)అనే చట్టం ఉనికిలో వుంది. అయితే, సామ్రాజ్యవాదుల ముఖ్యంగా అమెరికన్ అగ్రరాజ్య సామ్రాజ్యవాద ప్రయోజనాలకనుగుణంగా–దేశ వ్యవసాయ, పారిశ్రామిక, ఆర్థిక విధానాలనన్నింటినీ మలుస్తున్న తీరులోనే సిఆర్‌జడ్‌లో పాలక ప్రభుత్వాలు తమకు అవసరమైనప్పుడల్లా పలు సవరణలు(ఇప్పటికి 25సార్లకుపైగా) చేసుకుంటూ ఆ చట్టాన్ని నిరుపయోగంగా మిగిల్చి, ఆయా సామ్రాజ్యవాద బహుళజాతి పరిశ్రమలకు చొరబాటు పెద్దా వస్తున్నారు.

సిఆర్‌జడ్ ప్రకారం కోస్తాతీరంనుండి భూమివైపుగా 500 మీటర్ల దూరంవరకూ ఎలాంటి పరిశ్రమకూ అనుమతినివ్వకూడదు. తీరం వెంబడి సునామీలను, ఉప్పెనలను, తుఫాను భీభత్సాలను అరికట్టే లేదా తీవ్రతను తగ్గించేవిధంగా మడ అడవులు, సరుగుతోటలు, పెంచటంద్వారా తీరప్రాంత ప్రజానీకాన్ని పెనువిపత్తుల నుండి రక్షణ కల్పించే అంశాన్ని పాలకులు గాలికొదిలేశారు.

'మహారాష్ట్ర కాశ్మీర్'గా పిలువబడే కొంకణతీరం గత రెండు దశాబ్దాలకాలంగా నెలకొల్పిన అనేక ప్రమాదకర పరిశ్రమలతో కాలుష్యపూరితంగా మారి పోయింది. సిఆర్‌జడ్ చట్టాన్ని పూర్తిగా నీరుగార్చి ఈ పరిశ్రమలన్నింటికీ అనుమతులు మంజూరుచేశారన్నది వాస్తవం.

కొంకణతీరంలో ప్రస్తుతం ప్రధానంగా ముందు కొచ్చిన జైత్‌పూర్ అణువిద్యుత్ కేంద్ర నిర్మాణ ప్రాంత పీఠభూములు జీవవైవిధ్యానికి పేరుగాంచాయి.

ఇక జైత్‌పూర్‌కు ఉత్తరంగా 120 కి॥మీ దూరంలో 21వేల మెగావాట్ల సామర్థ్యంతో గ్యాస్, బొగ్గు ఆధారిత ఏడు విద్యుత్ కేంద్రాలున్నాయి.

అలాగే కొంకణతీరంలోనే మండాంగడ్, దపోలీ, దోడామార్గ్ తాలూకాలలో ప్రభుత్వం గనుల తవ్వకాలకు అనుమతిచ్చింది.

కొంకణ తీరంలోనే మరో వంద కిలోమీటర్లు ఉత్తరంగా ముంబయి రెండవ అంతర్జాతీయ విమానాశ్రయం కోసం షుమారు రెండువేల హెక్టార్ల భూమిని కేటాయించింది.

కొంకణతీరంలోని 200 కి॥మీ నిడివిలో రాష్ట్రప్రభుత్వం 9 అతిపెద్ద పరిశ్రమల స్థాపనకు పూనుకుంది. మరొక 15 బొగ్గు ఆధారిత విద్యుత్ కేంద్రాలను నిర్మించ తలపెడ్తున్నారు.

జైత్‌పూర్‌కు ప్రక్కనున్న సింధుదుర్గ్‌లోనూ రసాయన పరిశ్రమలు, గనుల తవ్వకాలు పెద్దఎత్తున సాగు

(తరువాయి 6వ పేజీలో)

**కొంకణ తీరంలో విద్యుత్ కేంద్రాలు**

| ప్రాంతం | కంపెనీ | సామర్థ్యం | ఇంధనం | స్థితి |
|---|---|---|---|---|
| భోపాన్–దపోలి | జి.ఎం.ఆర్.ఎనర్జీ | 1,800 మె.వా | బొగ్గు | ప్రతిపాదన |
| ధోపవే–గుహాగర్ | ఎన్.టి.పి.సి | 1,600 మె.వా | బొగ్గు | ప్రతిపాదన |
| దభోల్–గుహాగర్ | ఆర్.జి. అండ్ పి.ఎల్ | 2,200 మె.వా | గ్యాస్ | ఉత్పత్తి |
| జయగడ్–రత్నగిరి | జె.యస్.డబ్ల్యు.ఇ.ఎల్ | 1,200 మె.వా ఫేజ్ 1 | బొగ్గు | 75శాతం నిర్మాణం |
| జయగడ్, రత్నగిరి | జె.యస్.డబ్ల్యు.ఇ.ఎల్ | 3,200 మె.వా ఫేజ్ 2 | బొగ్గు | ప్రతిపాదన |
| రణపూర్, రత్నగిరి | ఫినోలెక్స్ | 43 మె.వా ఫేజ్ 1 | బొగ్గు | నిర్మాణం పూర్తయింది |
| రణపూర్, రత్నగిరి | ఫినోలెక్స్ | 1000 మె.వా. ఫేజ్ 2 | బొగ్గు | ప్రతిపాదన |
| మదవన్,జైత్‌పూర్–రాజపూర్ | ఎన్.పి.సి.ఐ.ఎల్ | 9,900 మె.వా | యురేనియం | ప్రతిపాదన |

**కొంకణ తీరంలో గనుల తవ్వకాలు**

| ప్రాంతం | కంపెనీ | విస్తీర్ణం | ఖనిజం | స్థితి |
|---|---|---|---|---|
| శఖారి–మండాంగడ్ | ఆషాపురా | 422 హెక్టార్లు | బాక్సైట్ | ఉత్పత్తి |
| కేలాషి, రోవ్‌లే, అంబర్‌షెట్ ఉతంబర్–దపోలి | ఆషాపురా | 460 హెక్టార్లు | బాక్సైట్ | ప్రతిపాదన |
| కాల్నే, ఉగదే–దోడామార్గ్ | మినరల్స్ అండ్ మెటల్స్ | 90 హెక్టార్లు | బాక్సైట్ | ఉత్పత్తి |

ఎన్‌టిపిసి–నేషనల్ థర్మల్ పవర్ కార్పోరేషన్; ఆర్.జి.అండ్ పి.ఎల్–రత్నగిరి గ్యాస్ అండ్ పవర్ లిమిటెడ్. జె.యస్.డబ్ల్యు.ఇ.ఎల్–జిందాల్ గ్రూప్; ఎన్‌పిసిఐఎల్–న్యూక్లియర్ పవర్ కార్పోరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్

(2011 ఫిబ్రవరి 11–'ఫ్రంట్‌లైన్' నుండి)

**కాలుష్య పూరితం...** (5వ పేజీ తరువాయి)

తున్నాయి. జైత్‌పూర్‌కు దగ్గరలోనే 'లోటేపర్శురామ్' దేశంలోనే అతిపెద్ద పురుగుమందుల, రసాయనాల ఉత్పత్తి కేంద్రంగా వుంది.

ఈ ప్రాంతం మొత్తాన్ని పుష్కలమైన జీవవైవిధ్యంతో కూడుకున్న ప్రాంతంగా ప్రకటించి వుండటమనేది మహారాష్ట్ర ప్రభుత్వానికి 'తలనొప్పి'గా పరిణమించింది. దీనిని అధిగమించి క్రమక్రమంగా కొంకణ తీరాన్నంతా ప్రైవేటీకరించేందుకు ప్రభుత్వం పూనుకొని వ్యవహరిస్తున్నది.

కొంకణతీరాన్ని అనుకునివున్న పడమటి కనుమలు కూడా రానున్న కాలంలో తీవ్ర విధ్వంసాన్ని ఎదుర్కోనున్నాయని 'బాంబే నేచురల్ హిస్టరీ సొసైటీ' (బిఎన్‌హెచ్‌ఎస్) డిప్యూటీ డైరెక్టర్ మరియు సముద్ర శాస్త్రవేత్త 'దీపక్ ఆప్టే' హెచ్చరిస్తున్నారు. కొంకణతీర ప్రాంతంలోని సముద్ర, జీవవైవిధ్యాలను ఒక సంవత్సరకాలంగా అధ్యయనం చేసిన బి.ఎన్.హెచ్.ఎస్. బృందం 'డైవర్సిటీ ఆఫ్ కోస్టల్ మెరైన్ ఇకోసిస్టమ్ ఆఫ్ మహారాష్ట్ర' పేరిట తన ప్రాథమిక నివేదికను మహారాష్ట్ర ప్రభుత్వానికి, కేంద్ర పర్యావరణ, అటవీ మంత్రిత్వశాఖకు సమర్పించింది. ఏ పరిశ్రమకు ఆ పరిశ్రమ పర్యావరణ ప్రభావ అంచనాలను, ప్రమాద తీవ్రతలను తక్కువ చేసి చూపుతూ లేదా ప్రమాదరహితమని తమ కనుకూలంగా తెచ్చుకుంటున్నాయి. తద్వారా కొద్ది విస్తీర్ణంతో– ముఖ్యంగా తీరప్రాంతంలో ఇన్నివిధాలైన ప్రమాదకారణ, విషపూరిత పరిశ్రమలయొక్క కలగలపు ప్రభావ తీవ్రత బయటకు వ్యక్తంగాకుండా జాగ్రత్తవహిస్తున్నారు. ఈ నేపథ్యంలో కొంకణతీరప్రాంత పరిశ్రమలన్నింటి సమిష్టి ప్రభావం పర్యావరణం, జీవవైవిధ్యంపై ఏవిధంగా ఉంటుందో సమగ్ర అధ్యయనం జరపాలని బి.ఎన్.హెచ్.ఎస్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది.

దేశవ్యాపితంగా, ముఖ్యంగా తీరప్రాంతంలో ముందుకొస్తున్న ప్రమాదకర పరిశ్రమల వ్యతిరేక ఉద్యమాల నేపథ్యంలో అటవీ పర్యావరణశాఖామంత్రి జైరామ్ రమేష్ అణువిద్యుత్ కేంద్రాలతో సహా కోస్తా తీరప్రాంతంలో నిర్మించబోయే అన్ని ప్రాజెక్టుల ప్రభావం పర్యావరణం, ప్రజల జీవనంపై ఎలా వుంటుందనే అధ్యయనంకోసం తమ మంత్రిత్వశాఖ ఒక కమిటీని ఏర్పరిచిందని ప్రకటిస్తున్నారు. అణువిద్యుత్ పరిశ్రమలను కొనసాగించి తీరుతామని ప్రకటిస్తున్న నోటితోనే పైప్రకటనలను కూడా చేస్తూ పర్యావరణ సంక్షోభాన్ని పరిష్కరించేందుకు వీరి అధ్యయనం తోడ్పడుతుందనటం ఎవర్ని మోసగించటానికో ఇట్టే అర్థమౌతుంది. D

**ఐవరికోస్టు...** (3వ పేజీ తరువాయి)

ఈ తీర్పును ఫ్రాన్సు అంగీకరించలేదు. ఔత్తారానే ఎన్నికైన అధ్యక్షుడిగా గుర్తించింది. ఐరాసతో తీర్మానం చేయించింది. ఔత్తారాతో పదవీ స్వీకారాన్ని సమాంతరంగా జరిపించింది. ప్రపంచ బ్యాంకు సహాయాన్ని నిలిపివేసింది. చివరికి పౌరుల మారణ కాండను ఆపేందుకు చర్య తీసుకోవాలని ఐరాస భద్రతా మండలితో తీర్మానం చేయించింది. ఈ తీర్మానాన్ని చూపి, ఐవరీకోస్టుపై దాడులకు దిగింది.

పౌరులను కాపాడమన్న ఐరాస తీర్మానానికి భిన్నంగా ఫ్రాన్సు విమానదళాలు ఐవరీ కోస్టులో బాంబు దాడులకు దిగాయి. ఆస్పత్రులు, విద్యాలయాలూ కూడా ఈ దాడిలో ధ్వంసమయ్యాయి. ఔత్తారా నాయకత్వంలోని దళాలు ఐదేళ్లుగా గబాగో దళాలను ఓడించలేకపోయాయి. ఒక ప్రతిస్తంభన ఏర్పడిన స్థితిలో ఫ్రాన్సు దాడులు ఔత్తారాకు పైచేయినిచ్చాయి. నాలుగు రోజుల దాడి తర్వాత ఫ్రెంచి సైన్యం గబాగోను పట్టుకుంది. ఔత్తారా దళాలకు అప్పగించి, వీధుల్లో త్రిప్పి, ఔత్తారా దళాలే పట్టు కున్నట్లుగా ప్రచారం చేసింది. చివరికు ఔత్తారాను అధ్యక్షుడిని చేసింది.

"ఆఫ్రికాలో ఫ్రాన్సు పాత వలసల చరిత్రలో మరో పేజీ వచ్చింది" అని లె ఎక్స్‌ప్రెస్ పత్రిక, ఐవరీకోస్టులో "శాంతి, ఆర్థికాభివృద్ధి పునరుజ్జీవనం ప్రారంభమైంద"ని లే పారిసియన్ పత్రిక ఆనందం వెలిబుచ్చాయి. గత పదేళ్లుగా గబాగో అనుకూల దళాలు పౌరులను ఊచకోత కోస్తున్నాయంటూ గగ్గోలు పెట్టిన ఈ పత్రికలు ఔత్తారా అనుకూల దళాలు సాగించిన మారణకాండ గురించి ఒక్క మాట పేర్కొనలేదు.

గబాగో అధికారంలోకి వచ్చేందుకు తోడ్పడింది ఫ్రాన్సు. అతనికి వ్యతిరేకంగా సైనిక తిరుగుబాటు వచ్చినప్పుడు అతనికి అనుకూలంగా సైన్యాన్ని దించింది ఫ్రాన్సు. ఇప్పుడు అతను శత్రువయ్యాడు. అణచి వేయటానికి గబాగోకు సహాయపడిన తిరుగుబాటు నాయకుడు ఔత్తారాకు తనరాయబార కార్యలయంలో ఆశ్రయమిచ్చి యిప్పుడు అధ్యక్షుడిని చేసింది. నిన్నటి శత్రువివ్వాళ మిత్రుడయ్యాడు.

ఫ్రెంచి పత్రికలు దీనికొక కారణాన్ని కనిపెట్టాయి. ఫ్రెంచి అధ్యక్షుడు సార్కోజీ భార్య సిసిలియాకూ, ఔత్తారా ఫ్రెంచి భార్యకూ ఉన్న స్నేహం రీత్యా సార్కోజీ ప్రభుత్వం ఔత్తారాకు మద్దతు తెలిపిందట. ఎన్నికల్లో పాల్గొనే అర్హత ఔత్తారాకు లేకుండా చేసి 2000 ఎన్నికల్లో గబాగో గెలిచినప్పుడు అప్పటి ఫ్రెంచి ప్రధాని లెయోనెల్ జాస్పిన్‌తోనూ, ఫ్రెంచి సోషలిస్టుపార్టీతోనూ గబాగోకు సత్సంబంధాలున్నాయి గనుక అప్పటి ప్రభుత్వం అతనికి మద్దతునిచ్చిందట. ఇది మూలకారణాల నుండి దృష్టి మరల్చే ప్రయత్నమే. అయితే ఈ మార్పులకు కారణాలను లోతుగా చూడాల్సివుంది.

డీగాల్ పాలన నాటి ఆఫ్రికాపై ఆధిపత్యాన్ని నిలుపుకొనే విధానాన్ని తిరిగి అమలు జరిపే ఉద్దేశం లేదని సార్కోజీ చెబుతున్నాడు. అయినా ఫ్రెంచి బూర్జువా పత్రికలు ఫ్రాంకాఫ్రిక్ గురించి ఎడతెగకుండా మాట్లాడుతున్నాయి. 1980లో ఐవరీ కోస్టులో 80 వేలున్న ఫ్రెంచి పౌరులు 2005 నాటికి 20 వేలకు తగ్గిపోయారు. ఫ్రెంచి వారి ప్లాంటేషన్లు సగానికి తగ్గాయి. కాఫీ, కోకో తదితర పంటల ఎగుమతి వ్యాపారంలో ఫ్రాన్సు స్థానం ఐదోది. అయితే ఇతర రంగాలలోకి, టెలికమ్యూనికేషన్లు, విద్యుత్తు నిర్మాణ రంగాల్లోకి దాని పెట్టుబడులు విస్తరిస్తున్నాయి. గత వాజీ వలసలన్నింటిలో ఈ రంగాల్లోకి విస్తరిస్తున్నది. ఇది కాక మిగిలిన ఆఫ్రికాదేశాల్లో కూడా అన్నిరంగాల్లోనూ ఫ్రెంచి బూర్జువా వర్గం ఎడతెగకుండా పెట్టుబడి మదుపు పెడుతున్నది. ఈ ఆర్థిక సామ్రాజ్య రక్షణ కోసమే అది తెగబడి సైనిక చర్యలకు పూనుకొంటున్నది.

మరో వైపున ఐవరీ కోస్టు ప్రజల్లో భూ సంస్కరణలు అమలు జరపాలన్న డిమాండు ముందుకు వస్తున్నది. ఈ డిమాండు ప్రధానంగా వలస వచ్చి స్థిర పడిన జాతుల నుండి వస్తున్నది. దీనినణచి వేసేందుకే జాతుల మధ్య వైషమ్యాలను రెచ్చ గొట్టే విధానాన్ని ఫ్రాన్సు చేపట్టింది. దానిలో భాగంగానే గబాగో జాతి విద్వేషాలు రెచ్చగొట్టే చర్యలు తీసుకున్నందున సమర్థించింది. ఈ డిమాండు ప్రధానంగా వచ్చిన వలస జాతులకు నాయకుడిగా వున్న ఔత్తారాను వ్యతిరేకించింది.

ఉత్తర ప్రాంతంలోకి పెట్టుబడుల విస్తరణ కోరుకున్న (ఇక్కడ బంగారం గనులు, సహజ వాయువు వున్నాయి) ఫ్రెంచి పెట్టుబడిదారులు గబాగో–ఔత్తారాల మధ్య అధికార పంపకానికి పూనుకున్నారు. ఉత్తర ప్రాంతం నుండి మిగిలిన పశ్చిమాఫ్రికా దేశాలలోకి విస్తరించాలన్న పథకమిది. అధికారాన్ని పంచుకోవటానికి గబాగో సిద్ధపడలేదు. దీనితో అతన్ని పదవీచ్యుతుడ్ని చేసేందుకు పూనుకున్నారు. ఔత్తారా ఫ్రెంచి డిమాండ్లకు తలఒగ్గాడు.

గబాగోకు ఎన్నికల కమీషన్ లెక్క ప్రకారం 41 శాతం ఓట్లు వచ్చాయి. దక్షిణ ప్రాంతంలో అతనికి మద్దతు వుంది. ఔత్తారా అధికారంలోకి వచ్చాడు. అయినా ఉత్తర ప్రాంతంలో భూ సంస్కరణల డిమాండు వుంది. గబాగో, ఔత్తారు లిద్దరు ప్రజలలో వున్న ఫ్రెంచి వ్యతిరేక భావాలను ఎన్నికల ప్రచారంలో వినియోగించు కున్నారు. ఇక ఉత్తర ప్రాంతంలోకి ఫ్రెంచి విస్తరణకు ప్రజల వ్యతిరేకతను తగ్గించగలగటం ఔత్తారాకు పెద్ద సవాలని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. అందుకనే సుపరిపాలన తేవాలనీ, ప్రతీకార చర్యలకు దిగరాదనీ ఔత్తారాకు సలహాలిస్తున్నారు. (ఇవాన్ సిమనోవిక్, ఐరాస అసిస్టెంట్ సెక్రటరీ జనరల్ 14-4-2011)

ఫ్రెంచి సామ్రాజ్యవాద ఆధిపత్య స్థాపన కోసం సాగిన ఈ దురాక్రమణ ఐవరీ కోస్టు ప్రజలకు శాంతిని యివ్వదు. తమ జీవనం, జీవన పరిస్థితుల మెరుగుదల కొరకు వారు సామ్రాజ్యవాదం నుండి స్వేచ్ఛ కొరకు పోరాటం సాగించాల్సివుంది. అలాంటి జాతీయ పోరాటం మాత్రమే వారికి శాంతినీ ఆర్థికాభివృద్ధినీ, సమానత్వాన్నీ యివ్వగలదు. ◈


**టి.ఎన్. మెమోరియల్ ట్రస్ట్ ప్రచురణ**

**కాంతి కేంద్రాలా! మృత్యు మందిరాలా ?**

**పరమాణు విద్యుత్ శక్తి గురించిన శాస్త్ర, సాంకేతిక, జీవావరణ, ఆర్థిక, రాజకీయ విశ్లేషణ**

**ఓ. పి. డి. ఆర్. అధ్యయన బృందం నివేదిక**

**వెల: రు. 15/-**

**మైత్రి బుక్ హౌస్**

**28-9-1, జలీల్‌వీధి, ఏలూరురోడ్, విజయవాడ**


# రైతు కూలీసంఘం (ఆం.ప్ర.) రాష్ట్ర కార్యవర్గ తీర్మానాలు

***రైతు కూలీసంఘం (ఆం.ప్ర.) రాష్ట్ర కార్యవర్గ సమావేశం ఏప్రియల్ 27-28 తేదీలలో విజయవాడలో జరిగింది. రెండు రోజుల ఈ సమావేశానికి సంఘం రాష్ట్ర అధ్యక్షులు కామ్రేడ్ ఝాన్సి అధ్యక్షత వహించారు. సంఘం నిర్వహించిన కార్యక్రమాల సమీక్షతోపాటు రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలను, సంస్థాపరమైన విషయాలను చర్చించుకొన్న అనంతరం ఈ క్రింది తీర్మానాలను సమావేశం ఆమోదించింది.***

## 1. అణు, థర్మల్ విద్యుత్ కేంద్రాల అనుమతులు రద్దు చేయాలి

మనరాష్ట్ర తీరప్రాంతంలో అసంఖ్యాక బొగ్గు ఆధారిత విద్యుత్తు కేంద్రాలకు ప్రభుత్వం అనుమతినిచ్చింది. పచ్చటి పంట పొలాలనుండి రైతాంగాన్ని గెంటివేసి ప్రైవేటు పరిశ్రమలకు ధారాదత్తం చేస్తున్నది. ఒక్క నెల్లూరు తీరంలోనే 24 ప్లాంటులకు అనుమతినిచ్చింది. ఇవన్నీ వాణిజ్య ప్లాంటులే. వీటిలో ఉత్పత్తి అయ్యే విద్యుత్తును రాష్ట్ర అవసరాలకు సరఫరా చెయ్యరు. దేశీయ పేర్లు వున్నా ఇవన్నీ విదేశీ పెట్టుబడిదారులవే.

ఇదికాక అమెరికా కంపెనీలకు రణస్థలంలో అణువిద్యుత్తు కర్మాగారాన్ని నిర్మించేందుకు అనుమతించింది. జపాను అణుకర్మాగారం ప్రమాదం తర్వాత కూడా అణువిద్యుత్తును మానేదిలేదని ప్రభుత్వం ప్రకటించటమేకాక, అణుకర్మాగారం వద్దని పోరాడుతున్న జైత్‌పూరు ప్రజలను బలిగొంది. సోంపేట, కాకరాపల్లిలలో కూడా నిరసిస్తున్న ప్రజలపై పాశవిక నిర్బంధానికి పూనుకుంది. కనపర్తి, నెల్లూరు ప్రజలు ఆందోళన సాగిస్తున్నా పెడచెవిన పెడుతున్నది.

ఇంతేకాక వీటికి సరఫరాచేసే యంత్రాల నిర్మాణ పరిశ్రమను కూడా విదేశీ కంపెనీల పరంచేసింది. దేశంలోని బొగ్గుగనుల్లో 70శాతం పెట్టుబడి విదేశీ కంపెనీలదే. దేశీయ బొగ్గు వనరులను విదేశాలపరం చేసి విదేశాలనుండి దిగుమతి చేసుకున్న బొగ్గుతో విద్యుత్తు ప్లాంటుల నిర్మాణానికి పూనుకుంది.

దేశీయ సింగరేణి, తాల్చేరు బొగ్గుతో, బిహెచ్‌ఇఎల్ సరఫరాచేసిన జనరేటర్లతో జెన్‌కో నిర్వహిస్తున్న విజయవాడ థర్మలు ప్లాంటు 94శాతం పైగా ప్లాంటు లోడు ఫ్యాక్టరు సాధించి దేశంలో అగ్రస్థానంలో నిలిచింది. విద్యుత్తు కర్యాగారాలను నిర్మించి, నిర్వహించగల సామర్థ్యం ప్రభుత్వరంగ సంస్థలకున్నదని నిరూపణ చేసింది. ఫ్లైయాష్‌ను ఇటుకల తయారీ, రోడ్ల నిర్మాణానికి అందించి, ఫ్లైయాఫ్ పాండునుండి నీటిని భూములకు అందించి పర్యావరణ సమస్యలను అధిగమించే ప్రయత్నం చేస్తున్నది.

అయినప్పటికీ ప్రభుత్వం ప్రైవేటురంగం పేరిట విదేశీ కంపెనీలకు అనుకూల విధానాన్ని అనుసరిస్తున్నది. రాష్ట్రంలో వున్న సహజ వాయు వనరులను ఇతర రాష్ట్రాలకు తరలించినా కిమ్మనటంలేదు. సాంప్రదాయేతర, సూర్యరశ్మివంటి వనరులనుండి విద్యుత్తు తయారీకి పూనుకుంటామన్న ప్రకటనలే తప్ప నిర్దిష్ట చర్యలు తీసుకోవటంలేదు.

అదే సమయంలో ప్రైవేటు కంపెనీలకు లాభాలు కట్టబెట్టి ప్రజలపై ఆ భారం మోపుతున్నది. విద్యుత్తు రెగ్యులేటరీ అథారిటీని లెక్కలువేసే స్థితికి దిగజార్చి ప్రతి ఏడాదీ విద్యుత్తు రేట్లు పెంచివేస్తున్నది. ఇంధన సర్‌ఛార్జీ పేరిట వినియోగదారులు వాడుకొనని విద్యుత్తుకు కూడా ఛార్జీలు వసూలు చేస్తున్నది. అయినా విద్యుత్తు సరఫరా లేక రైతాంగం పాట్లు చెప్పనలవికావు. చివరకి రైతాంగానికి ఉచిత విద్యుత్తుపై కూడా ఇంధన ఛార్జీల విధింపుకు పూనుకున్నది.

అన్నివిధాలుగా దేశపు, ప్రజల ప్రయోజనాలకు హానికరమైన ప్రభుత్వ విద్యుత్తురంగ విధానాన్ని రైతుకూలీసంఘం ఖండిస్తున్నది. అణుశక్తి విద్యుత్తు కర్మాగార నిర్మాణాల్ని పూర్తిగా ఆపివేయాలని డిమాండు చేస్తున్నది. రాష్ట్ర విద్యుత్తు అవసరాలను శాస్త్రీయంగా అంచనావేసి (ఇప్పుడు ప్రభుత్వ అంచనాలన్నీ తలపెట్టిన సెజ్‌లన్నీ పరిశ్రమలతో నిండిపోతాయన్న తప్పుడు అంచనాలే) వాటిని తీర్చే మేరకు ప్రభుత్వ రంగంలో, దేశీయ వనరులతో, వెనుకబడిన ప్రాంతాల్లో ఉపాధి సౌకర్యాలు మెరుగుపరిచే విధంగా విద్యుత్ ప్లాంటులు నిర్మించాలనీ, విచక్షణా రహితంగా ఇచ్చిన థర్మల్ విద్యుత్ కేంద్ర అనుమతులన్నీ రద్దుచేయాలనీ డిమాండు చేస్తున్నది. రైతాంగానికి ఎలాంటి సర్‌ఛార్జీలు లేకుండా 9 గంటలు నిరంతరాయంగా కరెంటు సరఫరా చేయాలని డిమాండు చేస్తున్నది.

## 2. కౌలు రైతులందరికీ కౌలుదారీ చట్టాన్ని అమలుచేయాలి

కౌలుదారీ చట్టాన్ని అమలు చేసి, కౌలుదారులను రిజిష్టరు చేస్తే, వారికి పంట రుణాలు, నష్టపరిహారాలూ అందుతాయి. కాగా సూటిగా వున్న ఈ పరిష్కారాన్ని ప్రక్కన పెట్టి రుణ పరపతి కార్డులిస్తాననటం కౌలుదారీ చట్టాన్ని నీరుగార్చటానికేననీ, ఆ చట్టమిచ్చిన పరిమిత హక్కులను కూడా కౌలుదారులకు నిరాకరించబూనుకున్నదన్నది స్పష్టం.

కాగా రుణ పరపతి కార్డులు యిచ్చినా కౌలుదారులకందే సహాయం నామమాత్రమే. సూక్ష్మరుణ సంస్థలవంటి మధ్యవర్తుల ద్వారా ఈ రుణ వితరణ బ్యాంకులు చెయ్యాలన్న ప్రతిపాదనా, ప్రతి ఏడాదీ రైతాంగాన్ని రెన్యూవల్ చెయ్యాలన్న ప్రతిపాదనా, కౌలు రైతాంగాన్ని అధికారగణం–నేతల అడకత్తెర కెరచేస్తాయి.

అనేక పోరాటాలు సాగిన ఫలితంగా కౌలు రైతులకు కొన్ని రక్షణలు కల్పిస్తూ ప్రభుత్వం చట్టం చేయాల్సి వచ్చింది. అయినా చట్టాన్ని అమలు జరిపేందుకు ఎలాంటి చర్యలూ తీసుకోలేదు. ఫలితంగా మూజువాణీ కౌలు పద్ధతి ఏర్పడి ఎలాంటి హక్కులూ లేని స్థితిలో కౌలు రైతాంగం వుంది. కౌలు రైతులుగా గుర్తింపు లేనందున వారికి సంస్థాగత రుణ సౌకర్యంగానీ, పంట కోల్పోయినప్పుడు నష్టపరిహారంగానీ అందటంలేదు. ఇటీవలి కాలంలో కౌలు రైతాంగం సంఖ్య పెరిగింది. రాష్ట్రంలో వారు 20 శాతముండగా, కొన్ని జిల్లాల్లో 70 శాతం కూడా మించినట్లు సర్వేలు తెలుపుతున్నాయి. తమకు సంస్థాగత రుణ సౌకర్యం అందాలన్న డిమాండు వీరి నుండి ఇటీవల బలంగా ముందుకొచ్చింది. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వం కౌలుదారులకు రుణపరపతి బిల్లును ప్రతిపాదించింది.

ఈ బిల్లును భూ యజమానులు వ్యతిరేకించారు. కౌలుదారీ చట్టం వర్తించి తాము భూమిపై హక్కు కోల్పోతామన్న వారి భయాలను తీర్చే బదులుగా, కౌలుదారీ చట్టం వర్తింప చేయకుండా రుణ పరపతి కార్డులిస్తానని ప్రభుత్వం వివరణ యిచ్చింది. ఆ మేరకు బిల్లులో సవరణ చేస్తానని ప్రకటించింది.

కౌలుదారీ చట్టం ప్రకారం కౌలుదారులందరినీ రిజిష్టరు చేసి వారి సాగు పెట్టుబడుల అవసరాలను సంస్థాగత రుణ సౌకర్యం ద్వారా పూర్తిగా తీర్చాలని రైతుకూలీసంఘం డిమాండు చేస్తున్నది.

## 3. ఇటీవల కురిసిన అకాల వర్షాలతో పంట నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలి

ఇటీవల కురిసిన అకాల వర్షాలవలన రాష్ట్ర వ్యాపితంగా లక్షా 61వేల హెక్టార్లలో పంటలు దెబ్బతిన్నాయి. వరి, మొక్కజొన్న, జొన్న పంటలకు ఎక్కువగా నష్టం జరిగింది. గత డిసెంబర్‌లో కురిసిన భారీ వర్షాలకు, వరదలకు పంటను కోల్పోయిన రైతాంగానికి ఇప్పుడు జరిగిన పంట నష్టంతో కోలుకోలేని పరిస్థితి ఏర్పడింది. గత పంట నష్టానికి ప్రకటించిన ప్యాకేజీ రైతాంగానికి ఊరట కలిగించకపోగా, అది కూడా పూర్తిగా అమలుజరగలేదు. కౌలురైతులు ఆ ప్యాకేజీకి దూరమయ్యారు. ఇప్పుడైనా రైతాంగానికి సరైన పరిహారం అందించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. తడిసి, రంగుమారిన ధాన్యానికి ఆంక్షలు, నిబంధనలు పెట్టకుండా మద్దతు ధర చెల్లించి మధ్య దళారులు లేకుండా ప్రభుత్వ సంస్థలే రైతులవద్ద కొనుగోలు చేయాలి. చిన్న, సన్నకారురైతుల బ్యాంక్ అప్పులను రద్దుచేయాలని రైతుకూలీసంఘంప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నది.

## 4. నిత్యావసర వస్తువుల ధరలను తగ్గించాలి

రోజురోజుకి నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతూనే వున్నాయి. ధరల పెరుగుదల సామాన్య ప్రజలను కుంగదీస్తున్నది. రెండు సంవత్సరాల కాలంలో ధరల పెరుగుదల వలన కుటుంబ ఖర్చులు రెట్టింపుకుపైగా చేరుకొంది. ధరలను అదుపుచేయటంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా (తరువాయి 7వ పేజీలో)

# నాగార్జున సాగర్ - కృష్ణా డెల్టాల ఆధునీకరణ పనులు-ప్రపంచ బ్యాంకు షరతులు

**నాగార్జునసాగర్**-కృష్ణా డెల్టాలను ఆధునీకరించి, సాగునీటి ఎద్దడితోపాటు, ముంపును నివారించి రైతాంగం ప్రయోజనాలు కాపాడుతామని రాష్ట్ర ప్రభుత్వం గొప్పగా చెప్పుకొన్నది. ఆధునీకరణ పనులు చేపట్టిన రెండు సంవత్సరాల, తొమ్మిది నెలల కాలంలో పూర్తి చేసిన పనులను గమనిస్తే, ఆధునీకరణ ఎప్పటికి పూర్తి అవుతుందో తెలియని అయోమయ పరిస్థితి ఏర్పడింది.

నాగార్జునసాగర్ ద్వారా ఏడు జిల్లాల్లోని 33 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాల్సి ఉంది. కుడి కాల్వ ద్వారా గుంటూరు-ప్రకాశం జిల్లాల్లో 11 లక్షల ఎకరాలకు, ఎడమ కాల్వ ద్వారా నల్గొండ, ఖమ్మం, క్రిష్ణా జిల్లాల్లో 10 లక్షల ఎకరాలకు నీరు అందించేందుకు బ్రాంచి డిస్ట్రిబ్యూటరీ కాల్వలను నిర్మించారు. వీటి ద్వారా పొలాలకు సాగునీరు అందించేందుకు మేజర్-మైనర్ కాల్వలను నిర్మించారు. ఆ తర్వాత వాటికి మరమ్మత్తులు చేసే పనిని గాలికి వదిలి వేయటంతో మేటలు వేసి నీరు సరిగా పారక తీవ్ర నీటి ఎద్దడితో పాటు, భారీ వర్షాల వలన ముంపు ఏర్పడింది. రైతాంగానికి తీవ్ర నష్టం వాటిల్లుతూ వస్తున్నది. రైతాంగం ఆందోళన చేసినప్పుడల్లా కంటి తుడుపు చర్యలు చేపట్టారే తప్ప, పూర్తి మరమ్మత్తులకు చర్యలు తీసుకోలేదు. ఫలితంగా సాగునీటి ఎద్దడి రైతాంగాన్ని వెన్నాడుతూ వస్తున్నది. తీవ్రనష్టం వాటిల్లుతూ వస్తున్నది. దాదాపు 150 సంవత్సరముల క్రితం ఏర్పడిన క్రిష్ణా డెల్టా కాల్వల వ్యవస్థకు మరమ్మత్తుల గురించి పాలకులు పట్టించుకొన్న పరిస్థితిలేదు. క్రిష్ణా నదికి మొదట ఆనకట్ట నిర్మించి కుడి, ఎడమ కాల్వలను ఏర్పాటు చేశారు. క్రిష్ణా ఈస్టర్న్ (ఎడమ) కాలువ ద్వారా పశ్చిమ గోదావరిలో 33 వేల హెక్టార్లకు, క్రిష్ణాజిల్లాలో 3 లక్షల 81 వేల హెక్టార్లకు, వెస్టర్న్ కెనాల్ ద్వారా గుంటూరు జిల్లాలో 2 లక్షల 32 వేల హెక్టార్లకు సాగునీటి సౌకర్యం కల్పించబడింది. ఈ రెండు మెయిన్ కాల్వలకు బ్రాంచి కాల్వలను ఏర్పాటు చేశారు. డ్రైయినేజీ వ్యవస్థను నిర్మించారు. 1953లో సంభవించిన వరదల వలన ఆనకట్టకు బీటలు ఏర్పడ్డాయి. రైతాంగం ఆందోళన ఫలితంగా ఆనకట్టను ప్రకాశం బ్యారేజిగా మార్చారు. 1956లో వచ్చిన తుఫాన్-వరదల వలన క్రిష్ణా డెల్టా తీవ్రంగా దెబ్బతిన్నది. దీన్ని పరిశీలించేందుకు ఆనాటి కేంద్ర ప్రభుత్వం మిత్రా కమిటీని నియమించింది. 1966-67సంవత్సరాలల్లో ప్రపంచబ్యాంక్ నిధులతో సి.ఇ.ఆర్.పి. ద్వారా వెయ్యికోట్ల రూపాయలతో మరమ్మత్తులు చేపట్టారు. ఆ సందర్భంలోనే దివిసీమలోని 24 వేల హెక్టార్లకు సాగునీటి సౌకర్యం కల్పించబడింది. ఈ ఆధునీకరణ తర్వాత తిరిగి మరమ్మత్తులు చేపట్టక పోవటం వలన కాల్వలు అధ్వాన్నంగా తయారయ్యాయి. 1977లో వచ్చిన దివిసీమ ఉప్పెన తర్వాత కూడా పూర్తిస్థాయి మరమ్మత్తులు చేపట్టకపోవటంవలన ప్రతి సంవత్సరం నీటి ఎద్దడి, ముంపు ప్రమాదం రైతాంగాన్ని వెన్నంటి వస్తున్నది. గుంటూరు జిల్లా రేపల్లె-బాపట్ల ఏరియాలో అధ్వాన్నమైన డ్రైనేజి వ్యవస్థవలన ప్రతి సంవత్సరం రైతాంగం పంటను కోల్పోవలసి వస్తున్నది.

2006 సం॥లో వచ్చిన ఓగ్ని తుఫాన్ -వరదల వలన గుంటూరు, పశ్చిమ గోదావరి, క్రిష్ణా జిల్లాల్లో అపార నష్టం జరిగింది. కాల్వల, చెరువుల, అధ్వాన్న పరిస్థితి మరోసారి బట్టబయలైయింది. పంట-మురుగు కాల్వల, కరకట్టల మరమ్మత్తులు చేపట్టాలనే ఆందోళన తీవ్రంగా ముందుకు వచ్చింది. ఇవి సక్రమంగా ఉండి ఉంటే ముంపు నష్టం తక్కువగా ఉండేదని అనేక మంది నిపుణులు పేర్కొన్నారు. కళ్ళకు కట్టినట్లు కనపడే ఈ వాస్తవాన్ని రాష్ట్ర ప్రభుత్వం వ్యతిరేకించలేక నాగార్జున సాగర్-క్రిష్ణా డెల్టాలను ఆధునీకరిస్తానని ప్రకటించింది. నాగార్జున సాగర్ ఆధునీకరణకు 4444 కోట్లను, క్రిష్ణా డెల్టా ఆధునికరణకు 4573 కోట్లను ఖర్చు చేస్తున్నట్లు ఆర్భాటంగా ప్రకటించింది. అందుకే ప్రపంచ బ్యాంక్ రుణాన్ని యాచించింది.

ఆధునీకరణకు అయ్యే మొత్తంలో సగం అప్పుగా ఇస్తానని ప్రపంచబ్యాంక్ ప్రకటించి, అందుకు కొన్ని షరతులు విధించింది. రాష్ట్రంలో నూతన జల విధానం అమలు జరపాలని, ప్రస్తుత సాగునీటి వ్యవస్థను ప్రాజెక్టుల ప్రత్యేక విభాగంగానూ, కాల్వల మరమ్మత్తుల, నిర్వహణా, నీటి నియంత్రణ యాజమాన్యంగానూ రెండుగా విడగొట్టాలని, ఒక దానితో మరొక దానికి సంబధం ఉండరాదని, సాగునీరు అందించే బాధ్యత నుండి ప్రభుత్వం తప్పుకోవాలని, కాల్వలకు నీటి మీటర్లు బిగించి నీటి పరిణామాన్ని బట్టి నీటిపన్ను వసూలు చేయాలని, ఇందుకోసం సాగునీటి సంఘాలు ఏర్పాటు చేయాలని, ఆ సంఘాలకు ఎటువంటి నిధులు కేటాయించరాదనేవి ఆ షరతుల్లో ఉన్న ముఖ్య అంశాలు.

ప్రపంచ బ్యాంక్ షరతులను ఆమోదించిన రాష్ట్ర ప్రభుత్వం అందుకు అనుగుణమైన చర్యలు చేపట్టింది. సాగునీటి రంగాన్ని రెండుగా విభజించింది. నీటి విడుదలకు వాటర్ రెగ్యులేటరీ అథారిటీని ఏర్పాటు చేసింది. ఈ అథారిటీ పంటకాల్వలకు ఎంతనీరు విడుదల చేయాలి, ఎంత ఛార్జీ వసూలు చేయాలనేది నిర్ణయిస్తుంది. అందుకోసం కాల్వలకు నీటి మీటర్లు ఏర్పాటు చేస్తుంది. నీటి వినియోగాన్ని నిర్ధారిస్తుంది. నీటి ఛార్జీల వసూలు కోసం రైతు సంఘాలను ఏర్పాటు చేస్తుంది. వాటర్ రెగ్యులేటరీ అథారిటీ నిబంధనలను వ్యతిరేకించిన వారిపై కేసులు బనాయిస్తుంది.

రాష్ట్ర ప్రభుత్వం ఇలాంటి నిర్ణయాలు తీసుకొన్న తరువాతే రుణం విడుదలకు ప్రపంచ బ్యాంకు సిద్ధమైంది. మొదటి విడతగా 2,200 కోట్లు విడుదల చేస్తున్నట్లు ప్రకటిచింది. దీన్ని తాను సూచించిన విధంగా ఖర్చు చేయాలని పేర్కొంది. అందుకే ప్రతిపనీ ప్రపంచబ్యాంక్ అనుమతితోనే చేయాల్సి వస్తున్నది. పనుల నిర్ణయంతో రాష్ట్ర ప్రభుత్వానికి ఎటువంటి ఆమోదం తెలపరు.

సాగర్ - డెల్టాల ఆధునీకరణ ఏవిధంగా చేపట్టాలనేది మన రాష్ట్రానికి సంబంధించిన అంశం. అది రైతాంగం ప్రయోజనాలకు అద్దం పట్టేదిగా ఉండాలి. రాష్ట్ర ప్రభుత్వం అందుకు విరుద్ధమైన విధానాలు అమలు జరుపుతున్నది. ప్రపంచబ్యాంక్ షరతులను ఆమోదించటం ద్వారా రైతాంగపు ప్రయోజనాలను బలిపెడుతున్నది. సాగునీటి రంగాన్ని నిర్వీర్యము చేస్తున్నది. నీటిపై రైతుల హక్కును హరిస్తున్నది. ఇలాంటి ఆధునీకరణ పనులు చేపట్టేకన్నా, చేపట్టకుండా ఉండటమే రైతాంగానికి మేలుగా వుంటుంది.

కాల్వలకు లైనింగ్ ఏర్పాటు చేసి, మీటర్లు బిగించి ఎకరానికి ఎంత నీరు అవసరమో వాటర్ రెగ్యులేటరీ అథారిటీ నిర్ణయిస్తుంది. రైతులు అంతే వాడాల్సి వుంటుంది. దీని ద్వారా నీటిని అదనపు సాగుకి మళ్ళించి ఎక్కువ ఆదాయం పొందటం లక్ష్యంగా పెట్టుకొంది. నీటి వాడకానికి రేషన్ విధించటం వలన వరిసాగు సమస్యగా మారుతుంది. ఇలాంటి పరిస్థితిని సృష్టించటం ద్వారా, ఆరుతడిపంటలకి రైతాంగాన్ని మరల్చే ప్రయత్నం చేస్తున్నది. ఫలితంగా ఆహార ధాన్యాల ఉత్పత్తులు పడిపోతాయి. పెట్టుబడిదారీ దేశాలలోని సంపన్నులకు అవసరమైన పండ్లు, కూరగాయలు, పూలు మొదలైన పంటలను రైతాంగం సాగు చేయాల్సి ఉంటుంది. ఇది రైతాంగాన్ని మరింత ఒడిదుడుకులకు గురిచేస్తోంది.

ప్రపంచ బ్యాంక్ షరతులను ఆమోదించిన ప్రభుత్వం ఆధునీకరణ పనులు అమలు జరపటంలో ఘోరంగా విఫలమైంది. కృష్ణా జిల్లాలోని తూర్పు డెల్టాతో పాటు, గుంటూరు జిల్లాలోని పశ్చిమ డెల్టాకు ఆధునీకరణ అంచనాలు రూపొందించింది. ఒక్క పశ్చిమ డెల్టాలోనే వెయ్యికోట్లకు పైగా ఖర్చు అవుతుందని అంచనా వేసి టెండర్లు పిలిచారు. ఈ టెండర్ల దశలో ఆధునీకరణకు అవరోధాలు ఏర్పడ్డాయి. బకింగ్‌హామ్ కెనాల్ ఆధునీకరణ ప్యాకేజీకి ఇంతవరకూ టెండర్లు ఖరారు కాలేదు. రేపల్లె కెనాల్, హైలెవల్ ఛానల్ ప్యాకేజీలకు కూడా కాంట్రాక్టర్లు ముందుకు రావటం లేదు. అందుకు కారణం అధికారులకు, కాంట్రాక్టర్లకు పర్సంటేజీల దగ్గర, టెండర్ మొత్తాల మధ్య ఏకీభావం లేకపోవటమే. మొదట నిర్ణయించినట్లు కాకుండా పనులను మరిన్ని ప్యాకేజీలుగా విడగొట్టినా టెండర్ల ప్రక్రియ పరిపూర్తికాలేదు. నిజాంపట్నం కాలువకు టెండర్లు ఖరారు అయినా, ఇంత వరకు పనులు ప్రారంభించలేదు. రెండు సంవత్సరాల 8 నెలల కాలంలో 35% పనులు మాత్రమే పూర్తి అయ్యాయి. మిగిలిన 65% పనులు 18 నెలల్లో పూర్తి చేయటం ఆచరణలో జరిగేదికాదు. మట్టి ద్వారా కాల్వలను పటిష్టపర్చే పనులు 75% పూర్తి అయినట్లు అధికారులు ప్రకటిస్తున్నారు. కాంక్రీట్ పనులు మాత్రం 25% లోపు మాత్రమే పూర్తి అయ్యాయి. **నల్గొండ** జిల్లాలో ఎడమ కాలువ ప్రాజెక్టు పరిధిలో 136.6 కి.మీ. దూరంలో చేపట్టాల్సిన వివిధ పనులకోసం 262.95 కోట్లు కేటాయించారు. ఈ పరిధిలో మెకానికల్ పనులు చేపట్టాల్సి ఉండగా, వాటి జోలికే వెళ్లలేదు. 36.29 లక్షల క్యూబిక్ మీటర్ల మట్టి పనులు చేయాల్సి ఉండగా 27.29 లక్షల క్యూబిక్ మీటర్ల పనులు మాత్రమే పూర్తి అయ్యాయి. కాల్వలకు సిమెంటు లైనింగ్ పనులు 26.53 లక్షల చదరపు మీటర్లు చేయాల్సి ఉండగా ఇప్పటివరకు 2.19 లక్షల చదరపు మీటర్ల పనులే పూర్తిచేయటం జరిగింది. సిమెంటు కాంక్రీటు పనులు 32,917 క్యూబిక్ మీటర్లు చేయాల్సి ఉండగా 10,041 క్యూబిక్ మీటర్లు మాత్రమే పూర్తి చేయటం జరిగింది. కట్టడాలకు సంబంధించి 123 పనులు చేయాల్సి ఉండగా 31 పనులు మాత్రమే పూర్తి చేశారు. క్రిష్ణాజిల్లాలోనూ ఆధునీకరణ పనులు ఈ విధంగానే జరుగుతున్నాయి. ➡

# పొగాకు గిట్టుబాటు ధరకై ఐక్య ఆందోళన

**ఒంగోలు, 6-4-11:**

2010-11 సం॥ పొగాకు పంట సీజన్‌లో అకాల వర్షాలతో 2010 నవంబరు నుండి 2011 ఫిబ్రవరి మొదటివారం వరకు పొగనాట్లు వేస్తూనేవున్నారు. నాట్లు మొదలైనప్పటినుండి రైతాంగం అననుకూల పరిస్థితులనే ఎదుర్కొన్నారు. దీనితో ఈ సం॥ విపరీతంగా ఉత్పత్తి ఖర్చులు పెరిగాయి. ఒక ఎకరాకు నాట్లు దగ్గరనుండి ఆకుకొట్టుడు, కాల్పువరకు 70నుండి 80వేలు ఉత్పత్తి ఖర్చులు అయ్యాయి. అయినప్పటికీ తోటలు ఎదిగే సమయానికి నేలపొడి ఆరిపోయి ఎకరాకు 4 క్వింటాళ్లు నుండి 6 క్వింటాళ్ళు సరాసరి దిగుబడి వచ్చింది. ఈ సం॥ పొగాకు బోర్డును 190 మిలియన్ల పొగాకు కావాలని వ్యాపారస్తులు కోరారు. అయితే బోర్డు 170 మిలియన్లకే ఇండెంట్ ఇచ్చింది. కానీ ఈ సంవత్సరము వాతావరణ పరిస్థితులు అనుకూలించక 130 నుండి 140 మిలియన్లు మాత్రమే దిగుబడి అయింది. ఐటిసి గుత్తాధిపత్యం క్రింద సిండికేట్‌గా ఏర్పడిన వ్యాపారస్తులు అనుమతించిన పంటకన్నా రైతాంగం ఎక్కువ పండిస్తున్నారనే నెపంతో గిట్టుబాటు ధర యివ్వకుండా వేలకోట్ల రూపాయలు లాభాలు గడిస్తూ రైతాంగాన్ని అప్పుల ఊబిలోకి నెడుతున్నారు. కానీ, ఈ సంవత్సరము బోర్డు నిర్ణయించిన దానికన్నా దిగుబడి తక్కువగా, ఎఫ్1 రకం ఎక్కువగా వచ్చింది. ఎఫ్2 120 రూపాయలతో ప్రారంభించి సరాసరి 70-80 రూపాయలకు పరిమితం చేశారు.

దీంతో ఆందోళన చెందిన రైతాంగం, రైతు, రైతుకూలీసంఘాలు; వేలం కేంద్రాల రైతు కమిటీలు "అఖిలపక్ష కార్యాచరణ కమిటీ"గా ఏర్పడి మార్చి 28 నుండి ఏప్రియల్ 5వ తేదీవరకు ఐటిసి ప్రాంతీయ కార్యాలయం ముందు రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఎఫ్1 పొగాకుకు 140 రూ॥లు, సరాసరి 120 రూపాయలు గిట్టుబాటు ధర యివ్వాలని డిమాండ్‌తో నిరాహార దీక్షలు సాగాయి. బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రెండు ధఫాలు వచ్చినా స్పష్టమైన రేటు నిర్ణయంతో రాలేదు. ఏప్రిల్ 3వ తేదీన వ్యాపారస్తులతో ఛైర్మన్ చర్చించి, అఖిలపక్ష కమిటీని చర్చలకు పిలిచి రేటు విషయం స్పష్టపరచలేదు. ఏప్రిల్ 5న వేలం కేంద్రాలు తెరవాలని ప్రకటించాడు. అఖిలపక్ష కమిటి ఏప్రిల్ 6వ తేది **బోర్డు ముట్టడి**కి పిలుపు ఇచ్చింది. దీనితో ఛైర్మన్ ఐటిసి, వ్యాపారస్తులతో చర్చలు జరిపి, శిబిరం వద్దకు వచ్చి ఎఫ్1 పొగాకుకు 124 రూపాయలు ఇస్తానని హామీ ఇచ్చినప్పటికీ ఐటిసి, వ్యాపారస్తుల మోసం వుందని అసంతృప్తితోనే రైతాంగం దీక్షలు విరమించారు.

ఈ 9 రోజుల కార్యక్రమంలో సమాఖ్య మాజీ అధ్యక్షులు చుంచు శేషయ్య, బోర్డు మాజీ సభ్యులు బంగారు బాబు, సభ్యులు బద్రిరెడ్డి, రైతుకూలీసంఘం జిల్లా అధ్యక్షులు వేజెండ్ల రామారావు, జిల్లా కార్యదర్శి ఎస్.లలితకుమారి, ఉపాధ్యక్షులు పరిటాల కోటేశ్వరరావు, రైతుసంఘాల నాయకులు ఎన్.రంగారావు, కె.వి.ప్రసాదు, వెంకయ్య, కె.నరసింహం, హనుమయ్య వేలం కేంద్రాల రైతుకమిటీల నాయకులు వి.ప్రసాదు, భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు. ఈ ఆందోళనకు మద్దతుగా సిపిఐ(ఎం-ఎల్), సిపిఐ(ఎం-ఎల్)ఎన్‌డి, సిపిఐ, సిపియం, టిడిపి, కాంగ్రెస్ వివిధ ప్రజాసంఘాలు, ఏపిఎఫ్‌టియు, స్త్రీవిముక్తి సంఘటన నాయకులు పాల్గొన్నారు. D

**తీర్మానాలు...** (6వ పేజీ తరువాయి)

విఫలమైనాయి. ఫ్యూచర్ ట్రేడింగ్ వ్యాపార లాబీ, మార్కెట్ శక్తులు, బ్లాక్‌మార్కెట్‌దారులు కృత్రిమ కొరతను సృష్టించి ధరలను పెంచుతున్నారు. రైతాంగం పండించే పంటలకు సరైనధర ఉండదు. మార్కెట్‌లో మాత్రమే వాటి ధరలు వినియోగదారులకు అందు బాటులో ఉండవు. ఈ విధంగా రైతులు, వినియోగదారులు మార్కెట్ శక్తుల దోపిడీకి గురౌతున్నారు. ప్రజలకు పెనుభారంగా మారుతున్న నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలని, ఫ్యూచర్ ట్రేడింగ్‌ని రద్దుచేయాలని, దొంగ వ్యాపారుల, దళారులపై కఠిన చర్యలు తీసుకోవాలని, సబ్సిడీ రూపంలో పేదలకు, సామాన్య ప్రజలకు ఆహార వస్తువులు ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా సక్రమంగా సరఫరా చేయాలని రైతుకూలీసంఘం(ఆం.ప్ర) రాష్ట్ర కార్యవర్గ సమావేశం డిమాండ్ చేస్తున్నది.

## 5. సకాలంలో రైతులకు విత్తనాలు అందించాలి

రాష్ట్రంలో రబీ సాగు పూర్తిఅయ్యింది. మరో 45 రోజులలో ఖరీఫ్ సీజన్ ప్రారంభం కాబోతున్నది. ప్రతి సంవత్సరం విత్తన కొరత ఏర్పడి రైతాంగం అనేక యిబ్బందులు పడుతున్నారు. సేద్యం ప్రారంభానికి ముందు విత్తనాల కొరతలేదని, సమృద్ధిగా విత్తనాలు ఉన్నాయని ప్రభుత్వం చెబుతూనే వుంది. అయినా విత్తనాలకోసం రైతాంగం వీధి ఆందోళనలు చేయక తప్పటంలేదు. ఆంధ్రప్రదేశ్ విత్తనాభివృద్ధి సంస్థకూడా విత్తన సేకరణలో విఫలమౌతూవస్తున్నది. ప్రభుత్వ నియంత్రణ లేకపోవటం, పరీక్షలు సక్రమంగా జరగకపోవటంతో నాణ్యతలేని విత్తనాలు మార్కెట్‌ను ముంచెత్తుతున్నాయి. బి.టి.పత్తి విత్తనాల రేటును పెంచేందుకు మోన్‌శాంటో ప్రభుత్వంపై ఒత్తిడి చేస్తున్నది. గత వైఫల్యాలను దృష్టిలో పెట్టుకొని వచ్చే ఖరీఫ్ సీజన్‌లో రైతులందరికీ నాణ్యమైన విత్తనాలను ప్రభుత్వమే అందించాలని, నకిలీ విత్తనాలను అరికట్టాలని, బి.టి. విత్తనాల ధరలు పెంచరాదని, వాటిని నిషేదించాలని, రైతుకూలీసంఘం (ఆం.ప్ర.) ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నది.

## 6. భూసేకరణ చట్టాన్ని రద్దుచేయాలి

1894లో బ్రిటిష్ వలస పాలకులు చేసిన భూసేకరణ చట్టాన్నే భారత దళారీ పాలకులు అమలు జరుపుతున్నారు. ఈ చట్టం ఎవరి భూమినైనా, ఎప్పుడైనా స్వాధీనం చేసుకొనే హక్కును ప్రభుత్వానికి కల్పించింది. ఈ చట్టాన్ని మార్చాలని అనేక ఆందోళనలు జరిగాయి. వంద సంవత్సరాల తర్వాత ఈ చట్టానికి అపుడపుడు చిన్నపాటి సవరణలు చేస్తూ, 2007లో మరో సవరణతో బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టారు. దీనిపై ఎటువంటి చర్చా జరగలేదు. 1894 చట్టాన్ని అనుసరించే దేశంలోనూ, రాష్ట్రంలోనూ, సెజ్‌ల పేరుతో రైతాంగంనుండి లక్షలాది ఎకరాలను ప్రభుత్వం స్వాధీనం చేసు కొంటున్నది. అసైన్డ్ భూములను పేదలనుండి లాక్కొని పరిశ్రమాధిపతులకు కట్టబెడుతున్నది. దుర్మార్గమైన భూసేకరణ చట్టాన్ని పూర్తిగా రద్దుచేయాలని, సెజ్‌ల పేరుతో స్వాధీనం చేసుకొన్న భూములను రైతులకు, పేదలకు తిరిగి యివ్వాలని సమావేశం ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నది.

## 7. లిబియాపై సామ్రాజ్యవాదుల దాడిని ఖండించండి

లిబియాలో గడాఫీ ప్రభుత్వం పౌరులపై దాడి చేస్తున్నదనే సాకుతో అమెరికా, పశ్చిమ యూరప్ సామ్రాజ్యవాదులు లిబియాపై దురాక్రమణ యుద్ధాన్ని ప్రారంభించారు. గగనతలంపై ఆ దేశ విమానాలు ఎగరకుండా భద్రతా సమితిలో తీర్మానం చేయించారు. ఈ విధంగా లిబియా ఆంతరంగిక వ్యవహారాల్లో జోక్యం చేసుకొన్నారు. అక్కడ ఎలాంటి ప్రభుత్వం ఉండాలన్న దాన్ని లిబియా ప్రజలే నిర్ణయించుకోవాలేతప్ప, ఆ దేశ ఆంతరంగిక వ్యవహారాల్లో ఇతర దేశాలు జోక్యం చేసుకోవటం నేరం. సామ్రాజ్యవాదులు విచ్చలవిడిగా జరుపుతున్న వైమానిక బాంబు దాడులవలన పసిపిల్లలతో సహా అనేకమంది మరణిస్తున్నారు. సామ్రాజ్యవాదులు లిబియా చమురు వనరులను కొల్లగొట్టటానికి, వారితొత్తు ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకొనేందుకే ఈ దాడులు ఉద్దేశించబడినాయి. లిబియాపై సామ్రాజ్యవాదుల దాడిని ఖండించాలని రాష్ట్ర ప్రజలకు కార్యవర్గ సమావేశం విజ్ఞప్తి చేస్తున్నది. D

➡ తుఫాన్‌లకు, భారీ వర్షాలకు, వరదలకు ప్రతి సంవత్సరం పంట నష్టపోతున్న రైతాంగం సాగర్-కృష్ణా డెల్టాలను ఆధునీకరించాలని కోరుకొంటున్నారు. రైతాంగం డిమాండ్ మేరకు యుద్ధ ప్రాతిపదికపై అది పూర్తి కావాల్సి ఉంది. ఆధునీకరణ పనుల్లో రైతాంగాన్ని కూడా ఉపయోగించాలి. రైతుల ప్రయోజనాన్ని కాపాడేదిగా ఉండాలి. ఆధునీకరించటం స్వతంత్ర విధానాలతో జరగాలి గాని, ప్రపంచబ్యాంక్ షరతులు విధించటాన్ని వ్యతిరేకించాలి. మన సాగునీటి రంగాన్ని పటిష్టపర్చేదిగా ఆధునీకరణ ఉండాలి తప్ప, దాన్ని నిర్వీర్యం చేయటాన్ని వ్యతిరేకించాలి. సాగునీటిని వ్యాపారంగా మార్చే ప్రపంచ బ్యాంకు షరతులను త్రిప్పికొట్టాలి. మన నీటి వనరులను, మన ఇష్టానుసారం వినియోగించుకొనే స్వేచ్ఛ, నీటిపై రైతుల హక్కును కాపాడాలి. సాగునీరు అందించే బాధ్యత నుండి ప్రభుత్వం తప్పుకొనే విధానాలను వ్యతిరేకించాలి. పై డిమాండ్లకు అనుగుణంగా రైతాంగంతో పాటు గ్రామీణ ప్రజలందరూ సమైక్యంగా ఉద్యమించాలి. D

# క్యాన్సర్ కారకమైన యాజ్‌బెస్టాస్ సిమెంట్ రేకుల పరిశ్రమ

**కృష్ణాజిల్లా** వీరులపాడు మండలం నరసింహారావుపాలెం గ్రామ పరిధిలో స్వస్తిక్ గ్రూపుకు చెందిన సహ్యాద్రి ఇండస్ట్రీస్ లిమిటెడ్ యాజమాన్యం 30 కోట్ల వ్యయంతో 50 ఎకరాల విస్తీర్ణంలో యాజ్ బెస్టాస్ సిమెంట్ రేకుల పరిశ్రమను ప్రారంభించేందుకు ప్రభుత్వం అనుమతించింది. ఈ పరిశ్రమకి పర్యావరణ అనుమతుల నిమిత్తము 'పర్యావరణ, కాలుష్య నియంత్రణ మండలి' అధికారుల ఆధ్వర్యంలో ప్రజాభిప్రాయ సదస్సు కొరకు రూపొందించిన పర్యావరణ ప్రభావ అంచనా నివేదికలో అనేక అవాస్తవాలను పేర్కొన్నారు.

ఫ్యాక్టరీ కోసం సేకరించిన భూమి రెండు పంటలు పండే వ్యవసాయ భూమి కాగా, నివేదికలో ఈ విషయాన్ని పొందుపరచలేదు. పరిశ్రమ నుంచి వెలువడే యాజ్ బెస్టాస్ దుమ్ము, సిమెంట్ ధూళి వలన శ్వాసకోశ వ్యాధులు వచ్చే అవకాశముందనీ, వాటిని నియంత్రిస్తామని పేర్కొన్నారు. కానీ పరిశ్రమ నుండి వెలువడే యాజ్ బెస్టాస్ ధూళివలన క్యాన్సర్‌కు ఎక్కువ అవకాశాలున్నాయనే విషయాన్ని దాటవేశారు. దేశంలోనూ, ప్రపంచ వ్యాపితంగానూ యాజ్ బెస్టాస్‌తో కూడిన రేకుల పరిశ్రమలోనూ, గనుల్లోనూ పనిచేసే కార్మికులు క్యాన్సర్ సోకి చనిపోయిన, చనిపోతున్న వాస్తవాన్ని దాచిపెడుతున్నారు.

పర్యావరణ ప్రభావ అంచనా నిమిత్తము అధ్యయనము కొరకు 8.7 కిలోమీటర్ల పరిధిలో గల నరసింహారావుపాలెం, జుజ్జూరు, రంగాపురం, ఇల్లూరు, పరిటాల, గొట్టుముక్కల, సున్నంపాలెం ఈ 7 గ్రామాలను మాత్రమే ఎంచుకున్నారు! అలాగే 8.7 కిలోమీటర్ల పరిధిలోనే వున్న చెన్నారావుపాలెం, పెద్దాపురం, జగన్నాధపురం, వెల్లంకి, గోకరాజుపల్లి, కంచికచర్ల, పొన్నవరం గ్రామాలను అధ్యయన ప్రాంతం నుంచి మినహాయించారు. పైన పేర్కొన్న గ్రామాల్లో షుమారు 25 వేల మందికి పైగా ప్రజలు నివసిస్తున్నారు. అత్యధికులు వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారు. వీరిలో ఎక్కువ శాతం, పేద, సన్న, చిన్నకారు రైతులే ఉన్నారు. కొందరు ఇతర వృత్తులు వారు కూడా ఉన్నారు. ఈ గ్రామాల్లో ప్రత్తి, మిర్చి, సుబాబులు, పొగాకు, కంది, వరి, పండ్ల తోటలను సాగుచేస్తూ చెరువులు, బోర్లు, నాగార్జున సాగర్ కాలవల మీద ఆధారపడి పంటలు పండిస్తున్నారు. ఈ అంశాలను అధ్యయనంలో ఉద్దేశ పూర్వకంగా దాటవేశారు.

అలాగే పరిశ్రమకు పక్కనే వున్న 'ఎనర్జీ లీడర్ బ్యాటరీస్ కంపెనీ లిమిటెడ్'లో నిత్యం 300 మందికి పైగా కార్మికులు పనిచేస్తున్నారు. పంట పొలాల మధ్య నిర్మించబోయే ఈ ఫ్యాక్టరీ నుంచి వెలువడే కాలుష్యానికి ఈ రెండు పరిశ్రమల్లో పనిచేసే కార్మికుల, ఉద్యోగుల, వారి కుటుంబాల పైన, పంటల పొలాల్లోనూ; అలాగే ఈ పరిశ్రమ సమీపంలోని విశాఖ యాజ్ బెస్టాస్ రేకుల పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికుల జీవనంపైనా యాజ్ బెస్టాస్ కల్గిస్తున్న దుష్ఫలితాలను ఎక్కడా పేర్కొనలేదు. ఈ పరిశ్రమ సమీపములో ఉన్న రిజర్వు ఫారెస్టులోకి, చుట్టుప్రక్కల పొలాలకు పశువులు, మేకలు, గొర్రెలు పెంపకము దారులు పచ్చిక కోసం జంతువులను తీసుకొనివస్తారు. జంతువులపై ఎటువంటి ప్రభావం పడుతుందో పేర్కొనలేదు.

నిర్మాణములో వైఫల్యము వలన, ఫైర్ యాక్సిడెంట్ వలన, నైపుణ్యము లేని కారణముగా లేక ఏమరపాటు కారణంగాకూడా ఎప్పుడైనా ప్రమాదాలు జరిగే అవకాశముంది. దిగుమతి చేసుకున్న యాజ్ బెస్టాస్ బ్యాగులను తెరచినప్పుడు, మిల్లులో పోసేటప్పుడు, మిల్లింగ్ చేసేటప్పుడు ప్రమాదకర ఆ ధూళి తప్పక గాలిలో కలుస్తుందని, అలాగే నెలకు 25 కిలోల వరకు యంత్రాల మధ్య యాజ్ బెస్టాస్ ధూళి పేరుకుంటుందని, పరిశ్రమలో శబ్దాలకు కార్మికులకు చెవుడు వచ్చే అవకాశము ఉందంటూనే వీటికి నివారణ చర్యలు తీసుకుంటామని, కార్మికులకు కళ్ళద్దాలు, ముఖానికి మాస్కులు, కాళ్ళు, చేతులకు గ్లౌజులు, ఇయర్ ప్లగ్‌లు అందిస్తామని పేర్కొన్నారు. ఇది ప్రమాదకరమైన పరిశ్రమ అని చెప్పకనే చెప్పారు.

ఉదాహరణకు ఈ ప్రాంతంలోనే కంచికచర్ల మండలం, గండేపల్లిలో నిర్మించిన 'సెంటిని బయో ప్రొడక్ట్సు కంపెనీ' వారు కూడా పర్యావరణ నిబంధనలకు నిలువెత్తు పాతర వేసి వ్యర్ధ కాలుష్య జలాలను వైరా ఏటిలోకి విడుదల చేయటంతో సుబాబులు, మాగాణి పొలాలు ఎండి పోయాయి. ఈ నీటిని తాగిన పశువులు చాలా చనిపోయాయి. ఫ్యాక్టరీ నుండి దుర్గంధముతో కూడిన వాయువులు విడుదల చేయటంతో మహిళలు గర్భాలను కోల్పోయారు. అనేక మందికి శ్వాసకోశ వ్యాధులు, తీవ్రమైన తల నొప్పులు, వాంతులు ఇంకా అనేక జబ్బులకు గండేపల్లి గ్రామ ప్రజలు గురయ్యారు. ప్రజలు ఆందోళన చేసినప్పటికీ అధికారులు సరియైన చర్యలు తీసుకోకపోవటంతో నేటికీ కంపెనీ నుంచి విడుదలయ్యే వ్యర్ధ కాలుష్య జలాలను జుజ్జూరులోని ఎన్.ఎస్.పి. పంట కాలువలలో ట్యాంకర్ల ద్వారా పారబోస్తున్నారు. దీనితో ఆ ప్రాంతమంతా తీవ్రమైన దుర్గంధము వ్యాపించటమే కాక ఆ నీటిని తాగిన పశు వులు, గొర్రెలు అనేకము చనిపోతున్నాయి. దీనిపై రైతులు స్థానిక తహశీల్దారుకు రిపోర్టు ఇచ్చినప్పటికీ కంపెనీపై ఏవిధమైన చర్యలు తీసుకోలేదు.

పై అనుభవాలను దృష్టిలో పెట్టుకున్నప్పుడు పర్యావరణ కాలుష్య నియంత్రణ చర్యలను చేపట్టటంలో ఫ్యాక్టరీ యాజమాన్యాలు ఏ మాత్రము చిత్తశుద్ధితో ఉండరని అర్ధమౌతున్నది. ప్రమాణాలను బాహాటంగానే ఉల్లంఘిస్తున్నారు. ఈ పరిస్థితులలో సహ్యాద్రి ఇండస్ట్రీస్ లిమిటెడ్ యాజమాన్యం పర్యావరణ కాలుష్య నియంత్రణ చర్యలను ఉన్నత స్థాయిలో చేపడతామని చెప్పేవన్నీ ప్రజలను మభ్యపరచటానికి మాత్రమే!

అలాగే ఈ పరిశ్రమలో రోజుకు 354 క్యూబిక్ మీటర్ల నీటిని భూగర్భ జలాల ద్వారా తీసకుంటామని చెప్పారు. ఈ లెక్కన ఆ ప్రాంతంలో కొద్ది కాలానికే భూ గర్భ జలాలు అంతరించి చుట్టుప్రక్కల ఉన్న బావులు, బోరుల్లో నీరు ఎండిపోతాయి. కొంతకాలానికి ప్రజలకు సాగు, తాగు నీటి ఎద్దడి ఏర్పడుతుందనేది స్పష్టమే!

## కార్మికులు-ప్రజలు-పర్యావరణంపై దీని దుష్ప్రభావాలు

1920నాటికి అమెరికాలో యాజ్ బెస్టాస్ పరిశ్రమల్లో, గనుల్లో పనిచేసే కార్మికులకు శ్వాసకోశ వ్యాధులు, గుండె, ఊపిరితిత్తులు, ఆహార నాళానికి క్యాన్సర్‌తో పాటు రకరకాల చర్మ వ్యాధులు వచ్చాయి. అమెరికాలో 2000 సం॥నాటికే యాజ్ బెస్టాస్ వలన 2 లక్షల మంది క్యాన్సర్ వ్యాధితో మరణించినట్లు నిర్ధారణ జరిగింది. ఈ వ్యాధులు సోకిన 10-15 సం॥ల తర్వాత గానీ బయటపడవు. కార్మిక సంఘాలు కోర్టునకు వెళ్ళిన ఫలితముగా -1970 నుంచి సీరియస్‌గా మెడికల్ రిపోర్టులు కొన్నైనా బయటకు వస్తున్నాయి. దాదాపు 1998 నాటికి అమెరికాలో యాజ్ బెస్టాస్ వాడకాన్ని, ఉత్పత్తిని నిషేధించారు. ఇంగ్లాండ్, ఫ్రాన్స్, జర్మనీ, స్పెయిన్, ఇటలీ, స్వీడన్ మొ॥లగు 58 ఐరోపా యూనియన్ దేశాలు దాదాపు 2004 నుండి యాజ్ బెస్టాస్‌ను నిషేధించారు. గుజరాత్ కాంపోజిట్ లిమిటెడ్‌లో యాజ్ బెస్టాస్ వలన 10 సం॥ల కాలంలోనే 75 మందికి క్యాన్సర్ వచ్చింది. వీరిలో 20 మంది చనిపోయారు. 2008లో ఆషా గుప్తా అనే లాయర్ ద్వారా కార్మికులు నష్టపరిహారం కోసం కోర్టులో కేసు వేశారు. యాజ్ బెస్టాస్ రేకులను పాఠశాల పై కప్పుల కోసం వాడటాన్ని కేరళ ప్రభుత్వం 2009లో నిషేధించింది. యాజ్‌బెస్టాస్ రేకుల క్రింద నివాసం చేసినా శ్వాసకోశ, చర్మవ్యాధులు లాంటివి వస్తాయని, నాడీమండలం మీద దాని ప్రభావం ఉంటుందని పేర్కొన్నారు. 2009లో విజయ్ జవహర్‌లాల్ అనే కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎం.పి. యాజ్ బెస్టాస్‌ను నిషేధించాలని రాజ్యసభలో బిల్లు పెట్టాడు. అయితే యాజ్ బెస్టాస్ కంపెనీ యాజమాన్యాలు టి. సుబ్బిరామిరెడ్డి ద్వారా మిగిలిన సభ్యులను కలుపుకొని సభలో ఈ బిల్లును వ్యతిరేకించారు. మన దేశంలో జరిగే యాజ్ బెస్టాస్ ఉత్పత్తి వ్యాపారంలో 25% కాంగ్రెస్ నాయుకులు జి. వెంకటస్వామి కొడుకు గడ్డం వివేకానంద (ప్రస్తుతం పెద్దపల్లి పార్లమెంటు సభ్యుడు) అజమాయిషిలో జరుగుతున్నది. మూడు నాలుగు సంవత్సరాల క్రితం గుజరాత్‌లోని షిప్ బ్రేకింగ్ యూనిట్‌కు యాజ్ బెస్టాస్‌తో కూడిన ఓడను విడగొట్టే కాంట్రాక్టు వచ్చింది. దీనికి వ్యతిరేకంగా ఆందోళన జరగటంతో ఆ ఓడ వెనక్కి వెళ్ళిపోయింది. యాజ్ బెస్టాస్ వలన ప్రపంచ దేశాలలోనూ, భారతదేశంలోనూ ఉత్పన్న మౌతున్న ప్రమాదకరమైనటువంటి ఇన్ని అనుభవాలు కళ్ళముందు ఉన్నప్పుడు ప్రజా ప్రయోజనాలకు ప్రాధాన్యత యిచ్చి యాజ్ బెస్టాస్ ఉత్పత్తులను ప్రభుత్వం నిలిపివేయాలి. యాజ్ బెస్టాస్ పరిశ్రమల అనుమతులను తిరస్కరించాలి. సిమెంటు రేకుల తయారీకి ప్రత్యామ్నాయాలవైపు పరిశోధనలు సాగించాలి.

E

# కోటిపాం థర్మల్ విద్యుత్ కేంద్రానికి ప్రజల వ్యతిరేకత-ఆందోళన

**పార్వతీపురం, 11-4-11:**

విజయనగరం జిల్లా, కొమరాడమండలంలోని కోటిపాం, గుమడ, చినఖర్జల, కొమరాడ పంచాయితీల పరిధిలో ఆల్‌ఫ్రా ఇన్‌ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ 12 వేలకోట్ల పెట్టుబడులతో 1675 ఎకరాలలో 2650 మెగావాట్ల సామర్థ్యంతో భారీ థర్మల్ విద్యుత్ కేంద్ర నిర్మాణానికి పూనుకుంది. పవర్‌ప్లాంట్ యాజమాన్యం నోరుకలిగిన కొందరు ప్రభుత్వాధికారులను లోబరుచుకుని తప్పుడు ప్రచారాలు సాగిస్తూ, మరో వైపు ప్రజలను ప్రలోభపరుస్తున్నారు. ఈ ప్లాంట్ పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన గిరిజన, గిరిజనేతర పేదలకిచ్చిన షుమారు 400 ఎకరాల బంజరు, ల్యాండ్ సీలింగ్, పోరంబోకు, వినోబాభావే భూములతో సహా 640 ఎకరాల ప్రభుత్వ భూములను పవర్‌ప్లాంట్‌కు అప్పగించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. దీనిపై ఆందోళన సాగుతున్నది.

ఈ నేపథ్యంలో కోటిపాం పవర్‌ప్లాంటు యాజమాన్యానికి అనుకూలంగా వ్యవహరిస్తూ రికార్డులు తారుమారుచేస్తున్న రెవిన్యూ అధికారులపై చర్యలు తీసుకోవాలనీ, పవర్‌ప్లాంటు కిచ్చిన అనుమతులన్నీ బయటపడ్డాయి. వీటిని రద్దుచేయాలని డిమాండ్ చేస్తూ రైతుకూలీసంఘం (ఆం.ప్ర) ఆధ్వర్యంలో పార్వతీపురం ఆర్.డి.ఓ. కార్యాలయంవద్ద ధర్నా జరిగింది. ఈ ధర్నా కార్యక్రమానికి కోటిపాం అగ్రహారం (గుమడ సీతమాంబపురం) కొమరాడ, కొత్తవలస గ్రామాలనుండి 150 మంది హాజరయ్యారు.

ఈ ధర్నా సందర్భంగా హాజరైన గిరిజన, రైతుకూలీ పేద ప్రజానీకాన్ని ఉద్దేశించి రైతుకూలీసంఘం(ఆం.ప్ర) జిల్లా కార్యదర్శి కా॥డి.వర్మ మాట్లాడుతూ ప్రజలకిచ్చిన డి-పట్టా భూములను వారికే అప్పగించాలని, ప్రజలు సాగుచేస్తున్న బంజరు, కొండ పోరంబోకు భూములకు పట్టాలు ఇవ్వాలని ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా పట్టించుకొనని రెవిన్యూ యంత్రాంగం పవర్‌ప్లాంట్ యాజమాన్యంతో కుమ్మక్కు అయి వారు అడిగినదే తడవుగా అన్ని రికార్డులూ అప్పజెప్పి ఏనాటినుండో ఆ భూములను నమ్ముకొని జీవిస్తున్న గిరిజన, గిరిజనేతర పేదలకు అన్యాయంచేస్తూ తప్పుడు రికార్డులు సృష్టించి రెవిన్యూ కార్యాలయాన్ని విద్యుత్‌ప్లాంటు ఆఫీసుగా మార్చివేశారన్నారు.

రైతుకూలీసంఘం(ఆం.ప్ర.)జిల్లా అధ్యక్షులు కా॥ఊయక ముత్యాలు మాట్లాడుతూ భూములను సాగుచేస్తున్న సాగుదార్లకు సంబంధం లేకుండా, ఎటువంటి ముందస్తు నోటీసులూ జారీచేయకుండానే, వారి పద్ధతి ప్రకారమే సాగుదార్ల అంగీకారం తీసుకోకుండానే రెవిన్యూ యంత్రాంగం ప్లాంటు యాజమాన్యానికి భూమిని దఖలుపరుస్తూ తీర్మానించిందనీ, ప్లాంటు యాజమాన్యం నిర్ణయించిన ధర ప్రకారం లెఖ్ఖకట్టి డబ్బులు తీసుకొని భూములనుండి తొలగిపొమ్మని దళారులు, పెత్తందార్లద్వారా బెదిరింపులు సాగిస్తున్నారన్నారు.

సంఘం కోశాధికారి కా॥ పి.శ్రీనునాయుడు మాట్లాడుతూ రెవిన్యూ యంత్రాంగం ప్రభుత్వ ఆదేశాలమేరకు నిస్సిగ్గుగా అక్రమాలకు పాల్పడుతూ భూముల రికార్డులను తారుమారు చేస్తున్నారనీ, గతంలో ఇచ్చిన డిపట్టాలను లేనివిగా చూపించి కొత్తగా పెత్తందారులకు హక్కు కల్పిస్తున్నారనీ; ఒక భూమికి ఇద్దరు, ముగ్గురికి చొ॥న పట్టాలిచ్చి కంపెనీకి అనుకూలించిన వ్యక్తుల పేరున అంగీకారం తెలిపినట్లుగా రికార్డులు సృష్టిస్తున్నారనీ నిర్దిష్ట ఉదాహరణలతో వివరించారు.

సంఘం ఉపాధ్యక్షులు కా॥బి.నర్సింగరావు మాట్లాడుతూ గిరిజనప్రాంత అభివృద్ధికోసం ట్రైబల్ సబ్‌ప్లాన్ నిధులనుండి 8కోట్ల రూ॥లు వనకాబడి రిజర్వాయర్‌కు కేటాయించారనీ, ఈ రిజర్వాయర్ నిర్మాణాన్ని పూర్తిచేయకుండా మధ్యలోనే ఆపివేసి, ఈ రిజర్వాయర్ క్రింద సాగవబోయే ఆయకట్టు భూములన్నింటినీ థర్మల్ విద్యుత్ కేంద్రానికి అప్పగించారన్నారు.

రైతుకూలీసంఘం జిల్లా సహాయకార్యదర్శి కా॥ ఎమ్. భాస్కరరావు మాట్లాడుతూ చెరువులను అభివృద్ధి చేయాలన్న హైకోర్టు ఉత్తర్వులకు భిన్నంగా 17 చెరువులను విద్యుత్ కంపెనీకి కేటాయించటంద్వారా వీటిపై ఆధారపడి జీవనం సాగిస్తున్న గిరిజన, గిరిజనేతర పేద కుటుంబాలన్నీ రోడ్డున పడ్డాయన్నారు. కావున పవర్‌ప్లాంట్‌కు ప్రభుత్వమిచ్చిన అనుమతులనన్నీ రద్దుచేయాలని డిమాండ్ చేశారు.

ధర్నా అనంతరం పై అంశాలపై మెమోరాండం అందజేసేందుకు సంఘ నాయకత్వం ఆర్‌డిఓ వద్దకు వెళ్ళగా ప్లాంట్ యాజమాన్యానికి లోబడిన ఆర్‌డిఓతో వాగ్వాదం జరిగింది. ప్రజల వత్తిడి, నినాదాలతో ఆర్‌డిఓ జనంవద్దకు వచ్చి మెమోరాండం తీసుకున్నాడు. ఈ సందర్భంగా ప్రజలు ఆర్‌డిఓను నిలవేశారు. సోంపేట, కాకరాపల్లిలలో పోలీసుల కాల్పుల అనంతరం కూడా మరింత పట్టుదలతో కోటిపాం థర్మల్ విద్యుత్ కేంద్ర వ్యతిరేక ఆందోళన సాగుతున్నది.

E

# యాజ్ బెస్టాస్ సిమెంట్ రేకుల పరిశ్రమ నిర్మాణానికి వ్యతిరేకత



పోలీసుల పహారాలో ప్రజాభిప్రాయసేకరణ

**నరసింహారావుపాలెం, 21-4-11:**

కృష్ణాజిల్లా వీరులపాడు మండలం నరసింహారావు పాలెం గ్రామ పరిధిలో సహ్యాద్రి ఇండస్ట్రీస్ లిమిటెడ్ యాజమాన్యం 30 కోట్ల వ్యయం అంచనాతో యాజ్ బెస్టాస్ సిమెంట్ రేకుల తయారీ పరిశ్రమను నెలకొల్ప బూనుకుంది. ఈ పరిశ్రమ పరిసరాలపై కల్గించే ప్రభావం గురించి 'పయనీర్ ఎన్విరో ల్యాబ్స్ మరియు కన్సల్టెంట్స్ ప్రైవేటు లిమిటెడ్, హైదరాబాదు' సంస్థ రూపొందించిన నివేదిక ఆధారంగా ప్రభుత్వ 'కాలుష్య నియంత్రణ మండలి' అధికార్లు ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు. రైతుకూలీసంఘం (అం.ప్ర.) కృష్ణాజిల్లా నాయకత్వం ఈ సందర్భంగా పర్యావరణ ప్రభావ నివేదికలో పేర్కొన్న అవాస్తవాలను ఎత్తిచూపుతూ సవివరమైన మెమోరాండంను రూపొందించి, కాలుష్య నియంత్రణ మండలి అధికారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో రైతుకూలీసంఘం (ఆం.ప్ర.) జిల్లా సహాయ కార్యదర్శి కా॥ వీరబాబు, జిల్లా నాయకులు కా॥ రాంబాబు పాల్గొని యాజ్ బెస్టాస్ ప్రజల ఆరోగ్యాలపై కల్గించే దుష్ప్రభావాల్ని వివరించారు. గ్రామ పంచాయితీల తీర్మానం లేకుండా ప్రమాదకరమైన పరిశ్రమ నిర్మాణానికి ఆమోదం పొందే ప్రయత్నాలని అభ్యంతర పెట్టారు. స్థానిక ప్రజా ప్రతినిధులకు, పర్యావరణ ప్రభావ అంచనా కోసం పరిగణలోకి తీసుకొన్న 14 గ్రామాల ప్రజా ప్రతినిధులందరికీ ఈ నివేదికను అందించాల్సి వుండగా ఈ రోజువరకూ ఎవరికీ నివేదిక అందివ్వకుండా ప్రజాభిప్రాయసేకరణను తూతూ మంత్రంగా ముగించదలుచుకున్నారని. విమర్శించారు. పర్యావరణ ప్రభావ నివేదికను ప్రభుత్వ సంస్థ ఎన్ఇఇఆర్ఐ ద్వారా కాక ప్రైవేటు సంస్థ ద్వారా రూపొందించటాన్ని ప్రశ్నించారు. ఈ పరిశ్రమ ద్వారా పెద్ద ఎత్తున ఉద్యోగాల కల్పన, భూముల విలువ పెరుగుదల, అభివృద్ధి వంటి అనేక అవాస్తవాలను ప్రచారం చేయటం ద్వారానూ, ప్రలోభ పరచటం ద్వారానూ పాలక రాజకీయ శక్తులను, మరికొందరు నిరుద్యోగ యువకులను యాజమాన్యం కూడగట్టి పరిశ్రమ నిర్మాణానికి అభ్యంతరం తెలియజేయటాన్ని వీరి ద్వారానే అడ్డుకోదలిచింది. మరో వైపున పోలీసులను పెద్ద ఎత్తున మోహరించి ప్రజాభిప్రాయ సేకరణ తంతును ముగించదలచినట్లు స్పష్టమౌతున్నది.

E

Printed, Published and Owned by P.Jaswantha Rao 32-13-26/1, B.M.Rao Road, Moghalrajapuram, Vijayawada-520 010
and Printed at Chaitanya Printers, Gora Veedhi, Suryaraopet Vijayawada-2
Editor: P. Jaswantha Rao, 32-13-26/1, B.M.Rao Road, Moghalrajapuram, Vijayawada-520 010